www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 54 గురువారం, జూలై 09, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



## నేడు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి జెపి నడ్డా

### - ఎయిమ్స్‌పై సమీక్షించనున్న మంత్రి

**హైదరాబాద్,జూలై 8 :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం తెలంగాణలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరా రైంది. గురువారం ఉదయం 10:55 నిమిషాలకు శంషా బాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు మిగతా2లో...

## గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

**● ఖమ్మం జిల్లాలో ఏర్పాటుపై సిఎంతో చర్చలు ● రేవంత్‌తో భేటీ అయిన గోద్రెజ్ ప్రతినిధులు**



**హైదరాబాద్,జూలై 8 :** తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. కమ్మం జిల్లాలో ఏర్పాటు కానున్న దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు. గోద్రేజ్ అగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గా÷-దర్గ÷న్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ అగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గా÷-దర్గ÷న్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. మిగతా2లో...



## 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

**అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలపై మంత్రి సురేఖ సమీక్ష**

**హైదరాబాద్,జూలై 8 :** నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జులై 20 నుంచి 22 వరకు ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. జులై 20 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.బల్కంపేట ఎల్లమ్మ దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమని భక్తుల విశ్వాసం అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ మిగతా2లో...

## తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

**● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పదోవ పట్టించే యత్నం ● 2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు ● మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి**



**హైదరాబాద్,జూలై 8 :** సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. మిగతా2లో...

## నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

**- ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు** 2లో

## విజయమ్మతో కలిసి వైఎస్సార్‌కు జగన్ నివాళి..!!



**అమరావతి,జూలై 8 :**మాజీ సీఎం జగన్ తన తండ్రి వైఎస్సార్ కు నివాళి అర్పించారు. వైఎస్సార్ జన్మదినం సందర్భం గా కుటుంబ సభ్యులతో కలిసి జగన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తల్లి విజయమ్మ.. భారతి సహా పలువురు పార్టీ నేతలు జగన్ తో కలిసి నివాళి అర్పించారు. వైఎస్సార్ తీసుకొచ్చిన సంస్కరణలు..అమలు చేసిన పథకాలను పార్టీ నేతలు ప్రస్తావించారు. జగన్ పులివెందులలో రెండో రోజు పర్యటన కొనసాగుతోంది.మాజీ సీఎం జగన్ ఇడుపులపాయలో మిగతా2లో...

## చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా..?
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో ఫైర్ అయిన మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,జూలై 8 :** గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు. మిగతా2లో...



## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

**రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన**

**నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం**

**ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**నాగర్‌కర్నూల్,జూలై 8 :** రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మిగతా2లో...

## ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

- సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి
- బిజెపి నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ



**న్యూఢిల్లీ,జూలై 8 :**ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు.బుధవారం) కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీలో కలిశారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్రమంత్రికి బీజేపీ నేతలు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా నేతలు మిగతా2లో...

# ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తాము చేపట్టిన రైతుగోస ఉద్యమం తర్వాత ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ వేగవంతం చేసి ఈఅఎకి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌లో సరైన విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2024-25లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరిస్తే ఈరోజు వరకు 13 నుంచి 14 శాతం బియ్యం కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. 2024-26 ఖరీఫ్ సీజన్‌లోని బియ్యం ఇంకా ఈఅఎకి చేరలేదని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదేవిధంగా వ్యవహారిం చారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ఔఅఆఅ ద్వారా రాష్ట్రాలకు కేంద్రం రుణాలు ఇస్తోందని వివరించారు. 2024-26లో రూ.37 వేల కోట్లు రాష్ట్రానికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు. 2026-27లో కూడా సుమారు రూ.23 వేల కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ధర్నా చేయాలని.. వాస్తవాలు చెబుతామని అన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం ఉత్పత్తి స్థాయికి తగ్గట్లుగా మౌలిక వసతులు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యంలో 70 శాతం నిధులను కూడా కేంద్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం పండించిన పంట సేకరణ విషయంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము చేపట్టిన రైతు గోస ద్వారా రైతుల ఆందోళనను స్వయంగా చూశామని తెలిపారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేశామని అన్నారు. అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినందకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2013-14లో అప్పటి యూపీఏ- 2లో కాంగ్రెస్ ప్రభుత్వం 24.32 లక్షల మెట్రిక్ టన్నులనూ మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసిందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో కేందప్రభుత్వం 146.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కొన్నదానికంటే 6 రెట్లు ఎక్కువగా మోదీ హయాంలో కొనుగోలు చేశామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వరికి రూ.2369 ఓ÷ూఖ చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో వరికి రూ.1300 ఓ÷ూఖ ఇచ్చిందని తెలిపారు. వడ్ల కొనుగోలుకు రూ.34891 కోట్లని తెలంగాణలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు, రైతుల పక్షాన తాము నిలబడతామని మాటిచ్చారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్రం చేస్తే మర ఆడించి బియ్యం పంపడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఎందుకు పడుతోందని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

# నీట్-యూజిసి సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

## ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు

**న్యూఢిల్లీ,జూలై 8** నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్,



హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

# తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ÷ళ్లైను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్-3 ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు.మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు.

# విజయమ్మతో కలిసి వైఎస్సార్‌కు జగన్ నివాళి..!!

(మొదటి పేజీ తరువాయి)

తన కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ కు నివాళి అర్పించారు. వైఎస్సార్ 77వ జన్మదినం సందర్భంగా తల్లి విజయమ్మ, భారతి సహా పలువురు కుటుంబ సభ్యులు ఇడుపులపాయకు చేరుకున్నారు. రెండు రోజులుగా పులివెందులలో ఉన్న జగన్ ప్రజాదర్బార్ నిర్వహించారు. పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. టెట్ పరీక్ష పైన పలువురు ఉపాధ్యాయులు జగన్ ను కలిసారు. ఈ సమస్య పైన కేంద్రంతో చర్చిస్తామని జగన్ హామీ ఇచ్చారు. అవినాశ్ రెడ్డి సహా పార్టీ నేతలతో స్థానిక అంశాల పైన చర్చించారు. వారికి కీలక దిశా నిర్దేశం చేసారు. స్థానిక ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని.. కేడర్ మొత్తం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక, ఈ రోజు ముఖ్య నేతలతో కలిసి ఇడుపులపాయకు వచ్చారు.తల్లి విజయమ్మ...కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన జగన్.. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. తల్లి విజయమ్మ సైతం ఇందులో పాల్గొన్నారు. జగన్ ను విజయమ్మ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. తరువాత ఇడుపులపాయలో ముఖ్యులతో జగన్ సమావేశమయ్యారు. పులివెందులతో సహా రాష్ట్రంలోని అంశాల పైన చర్చించారు. ఇక, వైఎస్సార్ జన్మదినాన్ని వైసీపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. పార్టీ ప్రధాన కార్యాలయంలోనూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వైఎస్సార్ జన్మదిన వేడుకలు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

# గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని
ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# నేడు హైదరాబాద్‌కు కేంద్రమంత్రి జెపి నడ్డా

(మొదటి పేజీ తరువాయి)

ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

# 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జులై 21న వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. జులై 22న సాయంత్రం ఘనంగా రథోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సేవలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు సురేఖ. పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌లతోపాటు అత్యవసర వైద్య బృందాలనూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు.

# అయోధ్య రామాలయంలో చోరీ ఘటనపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్

**-- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మదన్ మోహన్**



**బాలానగర్ జలై 09 (పీపుల్స్ న్యూస్)**
అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయంలో జరిగిన చోరీ ఘటన దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులను కలవరానికి గురి చేసిందని, ఈ ఘటనపై దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇప్పటివరకు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయోధ్యలోనూ కేంద్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, దేశంలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన శ్రీరామ ఆలయంలో చోరీ జరగడం ఆందోళనకరమని అన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఆలయానికి తగిన భద్రత కల్పించ డంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో స్వయంగా పాల్గొన్న ప్రధానమంత్రి, ఇప్పుడు అదే ఆలయంలో చోరీ జరిగినప్పటికీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో శ్రీరాముడి పేరును ప్రస్తావించిన వారు, ఆలయ భద్రత విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు వివరించాలని కోరారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శాంతిభద్రతలపై గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రామాలయంలోనే చోరీ జరగడం పాలనా వైఫల్యాన్ని బయటపెట్టిందని పేర్కొన్నారు. ఆలయ నిర్వహణ వ్యవస్థ, పోలీసు యంత్రాంగం, నిఘా వ్యవస్థలు సమర్థంగా పనిచేయకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పలు డిమాండ్లు చేసింది. ప్రధానమంత్రి వెంటనే అయోధ్యకు వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని, చోరీ ఘటనపై సుప్రీంకోర్టు విధుల్లో ఉన్న న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, ఆలయ నిర్వహ ణలో జరిగిన వ్యవహారాలపై భారత లెక్కల పరిశీలన సంస్థ ద్వారా సమగ్ర పరిశీలన చేపట్టాలని, అలాగే రామాలయ భద్రత కోసం ప్రత్యేక రక్షణ దళాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. రాముడు ఏ రాజకీయ పార్టీకి చెందినవాడు కాదని, ఆయన కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమని మదన్ మోహన్ అన్నారు. ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా భక్తుల విశ్వాసానికి సంబంధించిన విషయంగా చూడాలని సూచించారు. రామాలయ భద్రతపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మనసును కదిలించిన ఘటన.. పేద కుటుంబానికి గ్రామస్తుల అండ



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 08(పీపుల్స్ న్యూస్)**
చక్రవర్తిపల్లి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఘటన చక్రవర్తిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామపంచాయతీ పరిధిలోని 3వ వార్డు సభ్యుడు అజ్మీరా రవి సతీమణి రోజా అనారోగ్యంతో బాధపడుతూ, కనీసం సరైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో నిన్న సాయంత్రం కన్నుమూశారు. ఈ విషాదం గ్రామస్తుల హృదయాలను కలచివేసింది. రోజా మృతి అనంతరం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, ప్రజలు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా చక్రవర్తిపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున రూ.14,000, ఆనందపురం గ్రామస్తులు కలిసి రూ.20,000, ఎస్సీ కాలనీ గ్రామస్తులు రూ.3,500 అందజేశారు. మొత్తంగా రూ.37,500లను సర్పంచ్ భూక్య రఘు గారు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో చేయూతనిచ్చే చేయి వేల మాటలకన్నా గొప్పది" అనే మాటను నిజం చేస్తూ చక్రవర్తిపల్లి గ్రామ ప్రజలు చూపిన మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలిచింది. గ్రామస్తుల ఐక్యత, సేవాభావం పలువురి ప్రశంసలను అందుకుంటోంది.

# మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**. ....ఏ. బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి,**



**బాలానగర్ జలై 09 (పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఫతేనగర్ 260వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు కుక్కల క్రాంతి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజా సంక్షేమ పాలన, రైతులు, పేదల అభ్యున్నతి కి అందించిన సేవలను నాయకులు స్మరిం చుకున్నారు. ఈ కార్య కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి, ప్రోటోకాల్ కమిటీ సభ్యుడు సూరజ్ తివారి, కాంటెస్టెడ్ కె. కుక్కల .రాజు ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ ఎజాజ్, రాము, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గంధం చంద్రశేఖర్, వరాల స్వామి కుమారస్వామి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ ప్రధాన కార్యదర్శి అశోక్ చారి, శివాలయం ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింగ్ రావు, చిటకోరు నరేందర్, ఫతేనగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి, రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువజన కాంగ్రెస్, ఎస్సీ విభాగం, బీసీ విభాగం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

# గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి జీపీ-ఎస్‌పీపీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 08 (పీపుల్స్ న్యూస్)**
గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.
నేడు జూలై 9వ తేదీ గురువారం ఉదయం 10.00 గంటలకు ములుగు లీలా గార్డెన్స్‌లో జిల్లా స్థాయిలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క గారు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. గ్రామ పంచాయతీల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, గ్రామీణ పాలనలో నాణ్యతను పెంపొందించడం, ప్రజలకు మెరుగైన సేవలందించడం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో గ్రామ పంచాయతీల పాత్రను మరింత బలోపేతం చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, అమలు విధానాలు, పరిపాలనా అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు తమ పరిధిలోని ప్రతి సర్పంచి, పంచాయతీ కార్యదర్శి శిక్షణ కార్యక్రమానికి 100 శాతం హాజరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకొని వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నిర్ణీత సమయానికి శిక్షణా వేదికకు చేరుకుని కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, శిక్షణలో అందించే మార్గదర్శకాలను గ్రామాల సమగ్ర అభివృద్ధికి వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ పత్రాల పంపిణి, ఓటరు ధృవీకరణ ప్రక్రియను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి


**-- ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచన**

**-- పారదర్శకంగా వెరిఫికేషన్ నిర్వహించాలని అధికారులకు ఆదేశం..**



**బాలానగర్ జలై 09 (పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలా నగర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా జరుగుతున్న పత్రాల పంపిణి, ఓటరు ధృవీకరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పరిశీలించారు. బుధవారం దిల్‌కుష్‌నగర్ పరిధిలోని బూత్ నంబర్లు 99, 100, 101 వద్ద నిర్వహిస్తున్న వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తమ వ్యక్తిగత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన మార్పులు లేదా సవరణలు ఉంటే వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకునేలా ఈ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి వివక్షకు తావులేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆవుల రవీందర్ రెడ్డి సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు కావడం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం ఎన్నికల పారదర్శకతకు, ప్రజల ఓటు హక్కు పరిరక్షణకు అత్యంత కీలకమని ఆయన వివరించారు. ప్రజలు కూడా అధికారులతో పూర్తిగా సహకరించి అవసరమైన పత్రాలను సమర్పించాలని, తమ వివరాల్లో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిదిద్దించుకోవాలని సూచించారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, స్థానిక నాయకులు అబ్దుల్ ముజీబ్, మొహమ్మద్ తౌఫిక్, బీఎల్ఓలు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ భాగస్వాములు కావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు

# గుండెపోటుతో ఐటీసీ కార్మికుడు మృతి



**బూర్గంపహాడ్, జూలై 08 :** గుండెపోటుతో ఐటీసీ కార్మికుడు మృతి చెందిన సంఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాకలో బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక ముత్యాలమ్మపేటకు చెందిన వరికూటి నరసింహారావు (37) ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారంలో మెకానికల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా జనరల్ షిఫ్ట్‌నకు వెళ్లిన నర్సింహారావు లంచ్ అవర్‌లో పంచ్ కొట్టి బయటకు వచ్చాడు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఛాతిలో నొప్పి వస్తుండడంతో సమీపంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లే ప్రయత్నం చేశాడు. అక్కడ కుప్పకూలి పోవడంతో అక్కడున్న వారు హుటాహుటిన భద్రాచలం ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నరసింహారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు నర్సింహారావు మృతదేహంతో ఐటీసీ గేటు వద్ద ఆందోళనకు దిగారు. జనరల్ షిఫ్ట్‌నకు వెళ్లిన తన భర్త మృతికి యాజమాన్యం తగిన పరిహారం చెల్లించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేయడంతో యూనియన్ నాయకులు అక్కడకు చేరుకుని ఐటీసీ యాజమాన్యంతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# రికార్డుల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**- డీసీఆర్బీ విభాగాన్ని తనిఖీ చేసిన మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్**



**మెదక్,జులై,8,**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్బీ) విభాగాన్ని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఆర్బీలో నిర్వహిస్తున్న రికార్డులు, నేరాలకు సంబంధించిన డేటా, పెండింగ్ అంశాలు, కేసుల వివరాలు, సీసీటీఎన్ఎస్ నమోదు, ఈ-సాక్ష్య రికార్డులు, వారెంట్ల అమలు, రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చే సమాచారాన్ని సకాలంలో నమోదు చేసి ఖచ్చితమైన రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పోలీస్ స్టేషన్లతో సమన్వయాన్ని మరింత పెంచాలని సూచించారు.అలాగే, డీసీఆర్బీ పరిధిలోని అవసరమైన రికార్డులు, సమాచారాన్ని స్టేట్ రికార్డ్స్ బ్యూరో (క్ష్వ =వఌశీతీంం దీబతీఋబ -ూ=దీ)కు సకాలంలో పంపించాలని సిబ్బందిని ఆదేశించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేరాల విశ్లేషణ, రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం పాటించాలని, విధుల నిర్వహణలో క్రమశిక్షణ, జవాబుదారీతనం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు ఎస్పీ సూచించారు.ఈ తనిఖీలో డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ జార్జ్‌తో పాటు డీసీఆర్బీ సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నతల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

**- జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించిన జిల్లా న్యాయస్థానం**

**- శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**



**మెదక్,జులై,8,**
కన్నతల్లిని హత్య చేసిన కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.ఈ కేసు వివరాల్లోకి వెళితే, టేక్మాల్ మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన మోహన్ గారి సుదర్శన్ మద్యానికి బానిసై తరచూ తన భార్యను వేధించేవాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం సుదర్శన్ తన తల్లి సత్యమ్మ వద్దకు వెళ్లి డబ్బులు కావాలని మద్యం మత్తులో తరచూ గొడవపడుతూ, దుర్భాషలాడుతూ, దాడులకు పాల్పడేవాడు. అలాగే తన భార్యను తిరిగి తీసుకురావాలని తల్లితో తరచూ వివాదానికి దిగేవాడు.ఈ క్రమంలో 08-11-2025 అర్ధరాత్రి మద్యం మత్తులో తల్లితో మరోసారి గొడవపడి, కర్రతో ఆమె తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన సత్యమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు అధికారి (ఐఓ) అల్లాదుర్గ్ సీఐ రేణుక శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాధారాలు సేకరించి దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు.కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ నిందితుడు మోహన్ గారి సుదర్శన్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతమైన వాదనలు వినిపించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ కృష్ణ సమన్వయంతో పనిచేశారు.ఈ కేసులో తక్కువ సమయంలో దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు లైజన్ అధికారులు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# జూదం ఆడుతున్న ఆరుగురు అరెస్టు.

**పాపన్నపేట,జూలై,8,**
మండల పరిధి నార్సింగి శివారులోని సేవాలాల్ ఆలయ సమీపంలో జూదం ఆడుతున్న ఆరుగురిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఆయన కథనం ప్రకారం వివరాలు.మండల పరిధి నార్సింగి శివారులోని సేవాలాల్ ఆలయ సమీపంలో పలువురు జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించగా జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.5,450నగదు, ఆరు ఫోన్లు, ఐదు బైక్ లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.మండలంలో ఎక్కడైనా జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగిన ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుక, ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలు.

**- వంగూరి ఆనందరావు మాదిగ ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ జాతీయ నాయకులు వరంగల్ జిల్లా ఇన్చార్జి**









**వరంగల్ /ఖమ్మం/జులై 08/(పీపుల్స్ న్యూస్**
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ 32వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని అభినవ అంబేద్కర్ సామాజిక ఉద్యమాల రథసారథి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలను వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని ఎంఆర్పిఎస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు మాదిగ మరియు వరంగల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ లు తెలియజేసారు.జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్ కాశిబుగ్గ, గోవిందరాల గుట్ట, చింత మాదిగ బస్తి, లోతుకుంట, శాంతినగర్, వేణుమామల మార్కెట్ యార్డ్, సుందరయ్య నగర్, బస్తీలలో వరంగల్ మండల ఇన్చార్జి ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు గంగారపు మల్లన్న మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ 32వ జన్మదిన వేడుకలు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ జన్మదిన వేడుకలలో వరంగల్ జిల్లా ఇన్చార్జి వంగూరి ఆనందరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ, లు ముఖ్య అతిథి లుగా పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ మాట్లాడుతూ.. మహాజననేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో భారత దేశ ఉద్యమాల చరిత్రలోనే ఒక కుల ఉద్యమంగా ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన ఉద్యమం దాని లక్ష్యాన్ని సాధించడమే కాక సమాజంలోని అన్ని వర్గాల ప్రజల కోసం వారి సమస్యల సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని పోరాటాలు నిర్వహించి అనేక పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో సాధించడం అది కేవలం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలోనే సాధ్యమైందని ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ అన్నారు. చిన్న పిల్లల గుండె పరేషన్ల ఉచిత పథకంగా ప్రారంభమైన ఆ పథకం నేడు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్యశ్రీగా మారింది, అలాగే, వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు 200గా ఈ ప్రభుత్వాలు ఇస్తున్న పెన్షన్ అది నేడు 2000 రూపాయలుగా లభిస్తుంది అంటే అది ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చేసిన పోరాటాల ఫలితమేనని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రియాంక రెడ్డి చనిపోయిన సందర్భంలో అగ్రకులాల పిల్లలకు ఒక న్యాయం అనగారిన పిల్లలు హత్యలు అత్యాచారాలు కు గురైన సందర్భంలో ఒక న్యాయం జరగటం ఇది సరైనది కాదని ఉద్యమాలు నిర్వహిస్తే అది తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ రావడం, సమాజంలో ఏ మహిళ పట్టైనా ఏ పిల్లల పట్టైనా అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యలు అత్యాచారాలకు పాల్పడుతున్న ఏ స్థాయి వ్యక్తులైన నా కఠినంగా శిక్షించేందుకు చట్టాలు సాధ్యమైనయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యం అయిన సందర్భంలో దానిని మరల యధాతరంగా అమలు చేసుకోవడానికి అటు ఉత్తర భారత దేశాన్ని ఇటు దక్షిణ భారతదేశాన్ని ఏకం చేసి భారతదేశంలోని అన్ని పార్టీలలో కుల సంఘాలలో ఆ స్థాయికి ఎదిగిన వ్యక్తులను శక్తులను సమూహాలను ఎస్సీ ఎస్టీలను కూడగట్టి ఢిల్లీ స్థాయిలో ఉద్యమాలు నిర్వహించిన,ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ అని,అలా ఏకం చేసి ఆ చట్టాన్ని మరల పదునైన చట్టంగా దేశంలో పునర్జీవం పోసి దాన్ని అమలు చేసే కాడ ముందు వరుసలో మందకృష్ణ మాదిగ నిలవడం జరిగిందని అన్నారు.ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్ జీవోను, కూడా పోరాటాల ద్వారా సాధించుకున్న సంగతి అందరికీ తెలిసిందేనని ఈ సందర్భంగా అన్నారు.ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం లో ఉన్న న్యాయమూర్తి గవాయి పై అవమానం జరిగినప్పుడు దేశస్థాయిలోనే ఢిల్లీ స్థాయిలో ఉద్యమాలు నిర్వహించి దళిత బలహీన వర్గాల ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తుల జోలికి వస్తే సహించేది లేదని సమాజంలోని అగ్రకుల అహంకారంతో విర్రవీగుతున్న వ్యక్తులకు శక్తులకు సరైన సమాధానం ఇవ్వటం జరిగిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాటాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాల కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించి అనేక విజయాలు సాధించిన సందర్భం, ఈ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించటం ఖాయమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో, ఏ వర్గాల ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగిన ఏ వర్గాల ఏ స్థాయి గల వ్యక్తులకు అన్యాయాలు జరిగిన సరే, అటువంటి పరిణామాలను ఖండించి ముందు వరుసలో ఉండి వారికి న్యాయం చేకూర్చటంలో ఎమ్మార్పీఎస్ ప్రధాన పాత్ర పోషించిందని ఈ సందర్భంగా గుర్తు చేసారు ఈ సమావేశాలలొ ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ, వరంగల్ మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కన్నెబోయిన ప్రమోద్ మాదిగ, మాదిగ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షులు చింతం సిద్దు మాదిగ,వికలాంగుల కుల పోరాట సమితి జిల్లా సీనియర్ నాయకులు కన్నూరి చంద్రశేఖర్ మాదిగ, వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు మంద రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగలు జిల్లా తొలి తరం నాయకులు పోలె పాక యాదగిరి ప్రసాద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కోట రాజు మాదిగ, గద్దల కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎసు వరంగల్ జిల్లా నాయకులు ఇనుముల పూర్ణయ్య మాదిగ, సంగం మండల ఉపాధ్యక్షులు అశోక్ మాదిగ, జిల్లా కేంద్రంలోని వివిధ బస్తీల కమిటీల నాయకులు అయిత చంద్రమౌళి మాదిగ,దౌడు భాస్కర్ మాదిగ, రాజు మాదిగ, లాదెళ్ల రాజకుమార్ మాదిగ,ఈదునూరి అజయ్ మాదిగ, దౌడు సంపత్ మాదిగ, కే. విజయ్ మాదిగ, ఏనుగ భాను మాదిగ,జన్ను చిన్న మాదిగ, ఇనుముల రాజు మాదిగ, తాంద్ర హరీష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏఐటీయూసీనాలుగో మహాసభలు విజయవంతం చేయండి

- జెన్కో ముందు కరపత్రం ఆవిష్కరణ చేసిన కెటిపిపి ఆర్టిజన్ కార్మికులు
- ముఖ్య అతిది గా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతారాజు సతీష్
- ఏఐటీయూసీ హెచ్చు-64 స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు.



**భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూలై 08( పీపుల్స్ న్యూస్)**
ఈ నెల 12 వ తేదీ న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లో జరిగే ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ హెచ్-64 కేటీపీపీ రీజియన్ అధ్యక్షులు కోలా శ్యామ్ ఆధ్వర్యంలో స్థానిక జెన్కో ముందు ఆర్టిజన్ కార్మికుల తో కలిసి కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలోని ఏఐటీయూసీ ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక పోరాటాల్లో ముందు వరుసలో ఉండి కార్మిక సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళుతూ ఉందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఈ కొత్త కోడ్ ల వలన కార్మికులకు కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ అమలకు నోచుకోవడం లేదన్నారు. అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో ఉన్న కార్మికులందరూ పెద్ద ఎత్తున 12 న జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ హెచ్-64 ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, కోశాధికారి బొమ్మ కంటి పవన్,రీజినల్ కమిటీ నాయకులు పెరక రాజేష్, అల్లం వేణు, ఎండి సమీర్, బాలాజీ, రమేష్, ఎంబటి రవి పాల్గొన్నారు

# (జూలై 9 న) జరిగే రైతు మేళా కు సర్వం సిద్ధం..

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన ప్రదర్శనలు
- చింతకాని మండలంలో నిర్వహించే రైతు మేళా ను రైతులు వినియోగించుకోవాలి
- నూతన వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక స్టాళ్లు

జూన్ 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు







**ఖమ్మం/ జూలై 08/(పీపుల్స్ న్యూస్ )**
చింతకాని మండలం జగన్నాథపురం (మత్కెపల్లి క్రాస్ రోడ్) వద్ద జూలై 9న నిర్వహించే రైతు మేళా కు సర్వం సిద్ధం చేశామని, స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్ధతుల ప్రదర్శనలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపు నిచ్చారు. జూలై 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరాయన్నారు. కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కార్యక్రమ ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్, రైతు మేళా స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రజల రాకపోకల మార్గాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, విద్యుత్, సమాచార కేంద్రాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి అంశం సమయానికి పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రైతులకు విజ్ఞానం, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఒకే వేదికపై పరిచయం చేయాలనే లక్ష్యంతో రైతు మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, ఉద్యాన వనం, పశుసంవర్ధక, మత్స్యశా ఖ, పాల ఉత్పత్తి, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు విధానాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ పథకాలపై వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యే క స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.రై తులు కేవలం ప్రదర్శనలు మాత్రమే కాకుండా ఆధునిక వ్యవసాయ యంత్రాల పనితీరు ను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్నామని, అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులు, నీటి పొదుపు సాంకేతికత, పంటల వైవిధ్యీకరణ, విలువ ఆధారిత వ్యవసాయంపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేసేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాతో పాటు పరిసర రైతులు, ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో రైతు మేళాకు హాజరై కొత్త సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పెంపొందిం చుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రైతుల ఆదాయం పెంచే ఆధునిక వ్యవసాయ విధానాలను తెలుసుకు నేందుకు ఈ మేళా చక్కని అవకాశమని చెప్పారు.రైతు మేళాకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, భోజన వసతులు, వైద్య శిబిరాలు, సహాయ కేం ద్రాలు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియం త్రణ, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు సమగ్ర ంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు.జూలై 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాదిగా రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్ ప్రాంతాలు, అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేసేలా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు.అనంతరం ముఖ్యమంత్రి సభకు వచ్చే వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ట్రాఫిక్ రూట్ మ్యాప్‌లను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఏర్పాటును నాణ్యతతో, సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యానవన, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వడియారంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనీసుద్దీన్ పర్యటన





**చేగుంట, జూలై 08**
చేగుంట మండలం వడియారం గ్రామ పంచాయతీ, పీహెచ్‌సీ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహమ్మద్ ఖాజా అనీసుద్దీన్ బుధవారం పర్యటించారు. గ్రామంలోని డ్రైనేజీలు, నిల్వ ఉన్న మురుగునీటిని పరిశీలించిన ఆయన, దోమల నివారణకు గాను నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. అనంతరం ప్రజలకు, విద్యార్థులకు దోమల నివారణ కరపత్రాలను పంపిణీ చేసి, ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాయి కుమార్ గౌడ్,ఉపసర్పంచ్ నాగరాజు, పాలకవర్గ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**- చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్**




**చేగుంట జూలై 08**
చేగుంట పట్టణ లోని గాంధీ చౌరస్తా వద్ద మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్,పట్టణ సంద్రుగు సతీష్,జనరల్ సెక్రటరీ మొహమ్మద్ ముజామిల్, ఓబీసీ అధ్యక్షులు అన్నం ఆంజనేయులు, యూత్ అధ్యక్షులు మోహన్ నాయక్, పట్టణ ఉపసర్పంచ్ రఫీ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్మ లక్ష్మి,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంతోష్,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

# పర్యావరణ పరిరక్షణకై చెట్లని పెంచాలి

**-వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ యాదవ్..**

**-ప్రజ్ఞ హై స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం..**






**కూకట్ పల్లి : జూలై 08 (పీపుల్స్ న్యూస్ )**
పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలని ప్రజ్ఞా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం వనమ హోత్సవంలో భాగంగా, ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు ఉపాధ్యా యులు పాల్గొని చెట్లను నాటారు. అనంతరం ప్రీతమ్ యాదవ్ మాట్లాడుతూ, , హరిత హారం వనమహోత్సవంలో చెట్ల యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమం ముఖ్య అతిధులుగా పాపి రెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు చంద్రారెడ్డి, అస్బెస్టోస్ కాలనీ అధ్యక్షులు నరేష్ రాము హాజరై, మొక్కలు నాటి చెట్ల యొక్క ఉపయోగలను పిల్లలకు తెలియ జేశారు. ర్యాలీ నిర్వహించి ప్రజలకు చెట్ల గురించి అవగాహనా కల్పించారు.తెలంగాణను పచ్చని పొలిమేరగా మార్చేందుకు ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందిన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ వి ఆర్ జర్నలిస్టుని పరామర్శించిన చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ




**చేగుంట జూన్ 8**
చేగుంట మండలం చేగుంట గ్రామానికి చెందిన ఏ వి ఆర్ (ఎలక్ట్రానిక్ మీడియా) జర్నలిస్టు రవీందర్ నీ పరామర్శించిన చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ జర్నలిస్టు రవీందర్ గత కొద్ది రోజుల క్రితం కాలుకు ఇన్ఫెక్షన్ అయ్యిది, వారం క్రితం కాలుకి సర్జరీ అయింది విషయం తెలుసుకున్న చేగుంట ఉపసర్పంచ్ రఫీ అతని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. మీరు ఏమి బాధపడకండి తొందరగానే భాగవుతారు అని అన్నారు. మీరు ఏమి బాధపడకండి అని ధైర్యం చెప్పినాడు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రఫీ తో పాటు, రుక్మాపూర్ ఉపసర్పంచ్ కొలుపుల రామస్వామి, అయిత రఘు రాములు, నడిగొప్ప నాగార్జున, సోమ ప్రవీణ్, స్టాలిన్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్‌లో అనుమతి లేని భవన యజమానులకు గుడ్ న్యూస్



**హైదరాబాద్** మహానగర పరిధిలో అక్రమ నిర్మాణ జాబితాలో ఉంటూ సమస్యలను ఎదుర్కొంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్? న్యూస్ చెప్పింది. ఈ తరహా అనుమతి లేని భవనాల క్రమబద్ధీకరణపై కీలక నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపింది. జీహెచ్?ఎంసీ స్థానంలో కొత్తగా రానున్న చట్టానికి సంబంధించిన ముసాయిదాలో దీని గురించి ప్రస్తావించింది. దీని ద్వారా ఆయా భవనాల యజమానులకు 11 సంవత్సరాల తర్వాత మళ్లీ తీపి కబురు అందించినట్లయింది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయంతో లక్షలాది మంది భవన యజమానులకు లబ్ధి చేకూరడంతో పాటు ప్రభుత్వానికి కూడా భారీ ఆదాయం సమకూరనుంది.అఫిడవిట్ ద్వారా దరఖాస్తులు తీసుకొని : జీహెచ్?ఎంసీ చట్టం స్థానంలో త్వరలో రానున్న 'క్యూర్ – 2026' బిల్లుకి సంబంధించిన ముసాయిదాలో ఒకసారి పరిష్కారంలో భాగంగా దీన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం తెలిపింది. దీంతో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను జరిమానా ద్వారా క్రమబద్ధీకరించేందుకు ఆయా కమిషనర్లకు అధికారం కల్పించింది. అంటే ఈ బిల్లు అమలు పరిచిన తర్వాత అక్రమ నిర్మాణ భవనాల యజమానుల నుంచి అఫిడవిట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి, పాత వాటిని క్రమబద్ధీకరించనున్నారు.గత ప్రభుత్వం పథకాన్ని ప్రవేశ పెట్టగా : ప్రత్యేక రాష్ట్ర అవతరణ తర్వాత గత ప్రభుత్వం బల్దియాలో బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బీఆర్?ఎస్)ను ప్రకటించింది. సెప్టెంబరు 2, 2015 రోజున ఈ పథకాన్ని ప్రవేశపెడుతూ, జీహెచ్?ఎంసీ పరిధిలో అక్టోబరు 28, 2015 నాటికంటే ముందు అనుమతులు పొందకుండా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు తలపెట్టింది. బల్దియా పరిధిలోని భవన యజమానుల నుంచి మొత్తం 1.39 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.2,500 కోట్ల మేర ఆదాయం వచ్చింది. అయితే, అక్రమ నిర్మాణాలకు ఈ పథకం తోడ్పాటుగా వ్యవహరిస్తోందంటూ పలువురు కోర్టును ఆశ్రయించడంతో కొద్ది రోజులకే ఈ ప్రక్రియను నిలిపేశారు.ఎవరైనా దరఖాస్తు చేసుకునేలా : అప్పటి నుంచి 11 సంవత్సరాలుగా ఈ ప్రక్రియలో ఎలాంటి పురోగతీ లేదు. తాజాగా మహానగరంలోని మూడు కార్పొరేషన్ల కోసం రూపొందిన క్యూర్ – 2026 చట్టంలో ఈ బీఆర్?ఎస్? పథకానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఓ ప్రత్యేక నిబంధన తీసుకొచ్చింది. అందులోని సెక్షన్? – 160 ప్రకారం అప్పటి కటాఫ్? తేదీతోనే అనుమతి లేని భవనాలను క్రమబద్ధీకరించేలా జీహెచ్?ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లకు అధికారం ఇచ్చింది. అయితే, కేవలం అప్పుడు దరఖాస్తు చేసిన భవన యజమానులకు మాత్రమే కాకుండా ఇతరులు కూడా దరఖాస్తు చేసుకునేలా ఈ నిబంధన వర్తించనుంది.ఉల్లంఘనలకు పాల్పడితే క్రిమినల్ కేసులు : ఇప్పుడు దరఖాస్తు చేసుకోనున్న యజమానులు తమ భవనాన్ని 2015 కంటే ముందు నిర్మించినట్లు అఫిడవిట్ సమర్పిస్తే సరిపోతుందని నూతన చట్టంలోని ముసాయిదాలో పేర్కొంది. ఎవరైనా తప్పుడు సమాచారం ద్వారా లబ్ధి పొందాలని అప్లై చేసుకుంటే మాత్రం క్రిమినల్ కేసులు నమోదవుతాయి. అయితే, ఈ కీలక నిర్ణయం పట్ల ముసాయిదాలో స్పష్టంగా పేర్కొనలేదని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు. సరైన మార్గదర్శకాలు లేకుంటే, ఇటీవలే నిర్మించిన అక్రమ భవనాల యజమానులు సైతం దరఖాస్తు చేసుకొని హక్కులు పొందే అవకాశముందని గుర్తుచేస్తున్నారు...

# గాంధీ విగ్రహం వద్ద కంకులు అమ్ముతూ జీవన పోరాటం




**చేగుంట, జూలై 08** చేగుంట పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద గొడుగుపల్లి గ్రామానికి చెందిన నర్సవ్వ అనే వృద్ధురాలు నిరుపేదరికంతో మొక్కజొన్న కంకులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. భర్త చనిపోవడంతో ఒంటరిదైన ఆమె, కుటుంబ పోషణ కోసం రోడ్డు పక్కన మక్క బుట్టలు కాలుస్తూ బతుకుదెరువు వెతుక్కుంటోంది. ఆమెకు ఒక కూతురు ఉండగా, ఆమె కూడా మక్క బుట్టలు అమ్ముకుంటూనే జీవితాన్ని నెట్టుకొస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న ఈ కుటుంబం నిత్యం ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. చేగుంట గాంధీ విగ్రహం వైపు వచ్చే ప్రజలు, వాహనదారులు ఎవరైనా చిన్న చిన్న తినుబండారాలు కొనాలనుకుంటే.ఈ నిరుపేద తల్లి, కూతుళ్ల దగ్గరే కొనుగోలు చేసి వీరికి ఆర్థికంగా కొద్దిగా సహాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. మనమిచ్చే చిన్న ప్రోత్సాహం వారి కుటుంబానికి పెద్ద కొండంత అండగా నిలుస్తుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బడాబాబుల చేతుల్లో ప్రభుత్వ భూమి!

- సర్వే నెంబరు మార్పుపై తర్జనభర్జనలు..
- సర్కారు జాగాలో బహుళఅంతస్తులు..
- సర్వే చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్..




**శేరిలింగంపల్లి : జులై 08 (పీపుల్స్ న్యూస్)**
స్థానిక శేరిలింగంపల్లి మండలం పరిధిలోని, అత్యంత ఖరీదైన స్థలం కబ్జా విషయమై అధికా రులు నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారు. కబ్జాకు గురైందని ప్రచారంలో ఉన్న ప్రభుత్వ స్థలం అసలు కబ్జాకు గురైందో...లేదో తేల్చడానికి తటపటాయిస్తున్నారు. సంవత్స రాల తరబడి సర్వేల పేరుతో కాలయాపన చేస్తుండటంతో అధికారుల తీరుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.
తాజాగా రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండల పరిధిలోని, సర్వే నెంబరు 108, 110 ప్రభుత్వ స్థలములో ఓ ప్రయివేటు నిర్మాణ దారుడు తప్పుడు సర్వే నెంబరు ( 111) చూపించి, బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టి వాణిజ్య సముదాయాలు ఏర్పరచి కొనసాగిస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే స్థలంలో గతంలో సర్వే చేసిన అధికారులు ఇది సర్వే నెంబరు 108, 110 అని నిర్ధారించినా అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యంతో ఆ బహుళ అంతస్థుల వాణిజ్య సముదాయం ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోంది. ఈ విషయంపై సదరు అక్రమ నిర్మాణదారుడు ప్రముఖ న్యాయస్థానాన్ని సంప్రదించినట్లు, అధికారులను మ్యానేజ్ చేసుకుంటూ వస్తున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు అక్రమ నిర్మాణదారుడికి సర్వే నెంబరు లో భూమి ఉందా.. లేదా నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిలో కబ్జాలకు నడుం కట్టాడా అని అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

## ఎన్నికల విజయంపై న్యాయపోరు.. సీఎం విజయ్‌కు కొత్త చిక్కులు




తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత సి.జోసెఫ్ విజయ్‌కు మరో కొత్త సవాలు ఎదురైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీవీకే విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ మేరకు స్పందించింది న్యాయస్థానం. సీఎం విజయ్, కేంద్ర ఎన్నికల సంఘం మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. అలాగే సదరు పిటిషన్లపై కొన్ని ప్రక్రియా పర మైన అంశాలనూ లేవనెత్తుతూ, వాటిని సరి దిద్దుకోవాలని జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం సూచించింది. పెరంబూర్‌లో విజయ్ చేతిలో ఓడిన డీఎంకేకు చెందిన ఆర్‌డీ.శేఖర్, అదే నియోజకవర్గానికి చెందిన దినేశ్, లక్ష్మీనరసింహన్ అనే మరో ఇద్దరు ఓటర్లతో కలిసి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తిరుచ్చి ఈస్ట్ ఫలితాన్ని సవాల్ చేస్తూ డీఎంకేకు చెందిన ఎస్.ఇనిగో ఇరుదయరాజ్ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. విజయ్ ఎన్నికల ప్రచారంలో చిన్నారులను భావోద్వేగపూరితంగా ఉద్దేశించి, వారి ద్వారా కుటుంబ సభ్యుల ఓట్లను ప్రభావితం చేసేలా ప్రసంగించారని ఆరోపించారు. ఇది ఎన్నికల ప్రచారంలో చిన్నారులను వినియోగించరాదన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సాక్ష్యంగా చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో ఏప్రిల్ 21న విజయ్ ప్రచార ప్రసంగానికి సంబంధించిన వీడియోలను సమర్పించారు. అదేవిధంగా ప్రచార గీతాల రూపకల్పనకు సంబంధించిన ఖర్చులను ఎన్నికల వ్యయాల్లో చూపలేదని, ఆస్తుల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను బకాయిల వివరాల్లోనూ వ్యత్యాసాలున్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అలాగే ఏప్రిల్ 19న సెయింట్ ఆంటోనీ చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న అంశాన్నీ ప్రస్తావించారు. మరోవైపు.. విల్లివాక్కం ఎమ్మెల్యే, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఆధవ్ అర్జున్ ఎన్నికల విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పైనా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల విజయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా న్యాయస్థానం వారికి నోటీసులు పంపింది. కొందరు ప్రతివాదులు జులై 21లోపు తమ సమాధానాల్ని తెలపాలని ఆదేశించింది.

## అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం



**కుత్బుల్లాపూర్ : జూలై 8 ( పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ మండల్ పరిధిలోని సర్వేనెంబర్ 342 ప్రాంతంలో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రూమ్ బేస్మెంట్లో పెద్ద ఎత్తున నిర్మాణాలు నిర్మించారు. విషయం కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులకు చేరడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్ ఐ ఖలీమ్ సారథ్యంలో ఇతర రెవెన్యూ సిబ్బంది అ ప్రాంతంలో నిర్మించిన రూమ్ ను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ ఐ ఖలీమ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమణకు గురిచేసి నిర్మాణాలు చేపడితే తప్పనిసరిగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని గుర్తు చేస్తూ.. మరలా ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు ఆయన కబ్జా రాయులను హెచ్చరించారు.

## దక్షిణకొరియాలో నాలుగో రోజు మంత్రి లోకేశ్ పర్యటన - ఏపీలో పెట్టుబడులకు బూ యంగ్ గ్రూప్ ఆసక్తి



మంత్రి లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన నాలుగో రోజు కొనసాగుతోంది. ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్ నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన సియోల్ నుంచి రైలులో ప్రయాణించారు. ఆ తర్వాత ఏపీఈడీబీ ఆధ్వర్యంలో అపెక్స్ -- కొరియా పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగాన్ని లోకేశ్ ప్రారంభించారు.ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి చూపే కొరియా సంస్థలకు, ఏపీ ప్రభుత్వానికి మధ్య అపెక్స్ కొరియా అనుసంధానకర్తగా పనిచేస్తుందని లోకేశ్ పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసిన సంస్థలకు అవసరమైన సేవలను కూడా ఇది అందిస్తుందని చెప్పారు. ఆ తర్వాత బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బీఎన్?కే క్యాపిటల్ సీఈఓ సన్ డే జిన్, మేక్ ఇన్ ఇండియా కొరియా ఛైర్మన్ జంగ్ డియోక్ మిన్, ఎస్‌బీసన్స్ కంపెనీ ఛైర్మన్ డా.క్యూమ్ సిక్, హ్యుందాయ్ మోటార్స్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ కోఆపరేషన్) చోయ్ సియుంగ్ హూన్ లతో లోకేశ్ సమావేశమయ్యారు.పెట్టుబడులు, నిధుల నిర్వహణ, కన్సల్టింగ్ సేవల ద్వారా సార్టప్‌లు, ఎస్ఎంఈలకు మద్దతు ఇచ్చేందుకు బీఎన్‌కే వెంచర్ క్యాపిటల్ సంస్థ ఏపీలోని ఆర్‌టీఐహెచ్‌లో మెంబర్/మెంటర్‌గా చేరాల్సిందిగా లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న అమరావతిలో బీఎన్?కే ఫైనాన్షియల్ శాఖను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బీఎన్?కే ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బీఎన్?కే క్యాపిటల్ సీఈవో సన్ డే జిన్ తెలిపారు. అనంతరం పాదరక్షలు, షూ లేసులు, ప్రాజెక్టులైన అమరావతి, పారిశ్రామిక పార్కులు, విద్యుత్ మౌలిక సదుపాయాలు మొదలైన వాటికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్ అందించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రా నిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం, ఇంధన పరిశ్రమలకు చెందిన క్లయింట్?లను వారి పెట్టుబడి/ఉత్పత్తి గమ్యస్థానంగా ఏపీని ఎంపిక చేసుకునేలా ప్రోత్సహించాలని లోకేశ్ వివరించా రు. ఆంధ్రప్రదేశ్ మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈఓ, ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ, ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్?లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.చేస్తూ, రెడీ బిల్ట్ షెడ్ల కోసం అన్వేషిస్తున్నట్లు బూ యంగ్ గ్రూప్ సీఈవో ర్యాన్ కాంగ్ చెప్పారు. తమకున్న గ్లోబల్ నెట్ వర్క్ భారతీయ తయారీరంగాన్ని అనుసంధానిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీఈడీబీ సీఈఓ సగిలి షన్మోహన్, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, పరిశ్రమలశాఖ కమిషనర్ శుభం బన్సాల్, దక్షిణ కొరియాకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## పూనేలో భారీ వర్షాలకు కూలిన మూడంతస్తుల బిల్డింగ్ శిథిలాల కింద 14 మంది



**మహారాష్ట్ర:** మహారాష్ట్రను భారీ వర్షాలు వణికి స్తున్నాయి. పూనే పరిధిలో వర్షాల కారణంగా ఒక బిల్డింగ్ కూలిపోవడంతో, శిథిలాల కింద 14 మంది చిక్కుకుపోయారు. ప్రస్తుతం సహా యక చర్యలు చేపట్టి, వారందరినీ రక్షించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పూనే పరిధి పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మోష్మి ఏరియాలో బుధవారం జరిగింది. ఇక్కడి ఒక వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్‌లో మూడంతస్తుల బిల్డింగ్ కుప్పకూలింది. భారీ వర్షాల కారణంగా ఈ బిల్డింగ్ కూలినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనలో అందులో పని చేస్తున్న 16 మంది సిబ్బంది చిక్కుకుపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సేఫ్టీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ఇతర అధికా రులు సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రవి లాగ్డే స్పందించారు. ప్రమాదం జరిగిన సమయంలో బిల్డింగులో 16 మంది పని చేస్తున్నారని, బిల్డింగ్ కూలిన తర్వాత అందులోంచి ఇద్దరు బయటపడ్డారని రవి తెలిపారు. మిగిలిన వారు శిథిలాల కింద చిక్కుకోగా, వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం అందరినీ సురక్షితంగా తీసుకొచ్చామని తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. అయితే, క్షతగాత్రులకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎఫ్‌బీఐ వాంటెడ్ జాబితాలో పంజాబ్ పోలీసు ఆఫీసర్




**న్యూయార్క్:** అమెరికా ఎఫ్‌బీఐవాంటెడ్ జాబితాలో ఓ పంజాబీ పోలీసు ఆఫీసర్ ఉన్నారు. ఆపరేషన్ హార్డ్ బాల్ పేరుతో అమెరికా ఓ ఆపరేషన్ నిర్వహించింది. ఇండియా నుంచి నేరాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకునే క్రమంలో ఆ ఆపరేషన్ చేపట్టారు. అయితే మొత్తం 37 మంది భారతీయ నేరస్థులను వాంటెడ్ లిస్టులో అమెరికా చేర్చింది. గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, భగవాన్‌పురియా కూడా ఆ జాబితాలో ఉన్నారు. ఓ మర్డర్ కేసులో పోలీసు ఆఫీసర్ గురిందర్జీత్ సింగ్ అమెరికాలోని ఓ బాధిత కుటుంబం నుంచి సుమారు నాలుగు లక్షల డాలర్లు వసూల్ చేసినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో యూఎస్ అటార్నీ ఫస్ట్ అసిస్టెంట్ బిల్ ఎస్సేలీ ఈ విషయాన్ని తెలిపారు.

## వీబీ జీ రామ్ జీ పథకాన్ని 'రోజ్‌గాం అధికార్ చోరీ'గా అభివర్ణించిన కాంగ్రెస్



: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ 'వీబీ జీ రామ్ జీ' పథకంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ కొత్త చట్టాన్ని రోజ్‌గార్ అధికార్ చోరీ(ఉపాధి హక్కుల దొంగతనం)గా అభివర్ణించారు. గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎంజీ నరేగా) స్థానంలో కేంద్ర ప్రభుత్వం బలవంతంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ కొత్త చట్టాన్ని విమర్శిస్తూ, జమ్ముకశ్మీర్? మాజీ ఆర్థిక మంత్రి హసీబ్? ద్రాబు రాసిన వ్యాసాన్ని పంచుకున్నారు."ఎంజీ నరేగా పథకాన్ని ఇప్పుడు వీబీ జీ రామ్ జీ అని పేరు మార్చారు. ఇది హక్కుల, డిమాండ్ ఆధారిత పథకం. ఇది కుటుంబాలకు 100 రోజుల పాటు నైపుణ్యం అవసరం లేని పనిని పొందే చట్టపరమైన హక్కును కల్పించింది" అని హసీబ్ ద్రాబు ఒక ఆంగ్ల దినపత్రికలోని తన వ్యాసంలో తెలిపారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టం గ్రామీణ ప్రజలకు రాజ్యాంగబద్ధమైన పని హక్కును కల్పించి, గ్రామ పంచాయతీలకు అధికారాలను ఇచ్చేదని, కానీ, ప్రస్తుత కొత్త విధానం వల్ల అన్ని అధికారాలు కేంద్రం చేతుల్లోకి వెళ్తాయని జైరాం రమేశ్? ఆరోపించారు. ఈ కొత్త పథకం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై భరించలేనంత ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఎంజీ నరేగా లాగా ఏడాది పొడవునా అమలులో ఉండదని రమేశ్? స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, గత బుధవారం వీబీ జీ రామ్ జీ చట్టం అమల్లోకి వచ్చింది. అయితే, కొత్త చట్టం కింద వేతనాలు తక్కువగా ఉన్నాయని పేర్కొంటూ, గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేసి, ఎంజీనరేగాను తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.మరోవైపు, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు అత్యంత సన్నిహితులైన నలుగురిని రెండు రోజుల్లోనే తొలగించడంతో, ఆ శాఖలో పాలన కుప్పకూలిందని జైరాం రమేశ్? ఆరోపించారు. దేశంలో పర్యావరణాన్ని, అడవులను పరిరక్షించడానికి మంత్రిత్వ శాఖ పెద్దగా ఏమీ చేయలేదని, 'పర్యావరణ మంత్రిత్వ పర్యావరణ వ్యవస్థలతో సహా దేశవ్యాప్తంగా పర్యావరణ విధ్వంసం ంగా కొనసాగుతోందని తెలిపారు.

# సంపాదకీయం



## కాళేశ్వరం కథ కంచికి చేరేదెలా ?

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పడని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్దంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్దిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.



# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

**ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు**

**అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు**

**బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు**

**టెహ్రాన్,జులై8:** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది.హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికాతీవ్ర ఉల్లంఘనలకు పాల్పడు తోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు.ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దా డికి తామే బాధ్యులమనిఇరాన్ఇప్పటివరకు ప్రకటించలేదు.

# గల్లంతయిన మత్స్యకార కుటుంబాలకు భరోసా

**పదిలక్షల చొప్పున పరిహారం**

**అందించిన మంత్రి కొల్లు**

**గల్లంతయిన వారి జాడ తెలియక**

**కుటుంబాల్లో విషాదం**



**విశాఖపట్నం,జూలై8:** విశాఖ సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది. బుధవారం మృతుల కుటుంబాలకు మంత్రి కొల్లు రవీంద్ర చెక్కులను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఐదు లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఐదు లక్షలను అందజేశారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు మత్స్యకారుల కుటుంబాలకు అందించి నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కూడా మత్స్యకారులకు ఇవ్వాల్సిన 63 క్లెయిమ్స్ పెండింగ్‌లో పెట్టారన్నారు. రూ.3.15 కోట్లను కూడా ఈరోజు క్లియర్ చేశామన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన డిపార్ట్‌మెంట్‌లతో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని మంత్రి కొల్లురవీంద్ర పేర్కొన్నారు. మరోవైపు మంత్రి రాకను మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా నిరసించాయి. తమవారిని రక్షించకుండా ఎందుకు వచ్చారని నిలదీశారు. ఇకపోతే సముద్ర జలాల్లో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు చెందిన మహిళలను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. చేపలరేవులోని బోటు ఆపరేటర్ల సంఘం కార్యాలయంలో తమ వారి రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూనే ఉన్నారు. బోటు యజమాని కారి చిన్న సురక్షితంగా బయటకు వచ్చి తన కళ్ల ఎదుటే సహచరులు మునిగిపోయారని చెప్పడంతో వారిలో ఆందోళన మరింత తీవ్రమైంది. ఇంటి పెద్దల జాడ తెలియకపోవడంతో పిల్లలతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నారు. కొందరు కడసారి చూపులకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ వచ్చిన సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని.. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని.. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని వారంతా కోరారు.చేపల రేవుకు పది నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదంలో చిక్కుకున్న సమాచారాన్ని వారి కుటుంబసభ్యులు ఈ నెల 4న సాయంత్రం 4 గంటల సమయంలో మత్స్యకార సంఘాల నేతలకు తెలియజేసినప్పటికీ ఆ విషయం మత్స్య శాఖ అధికారుల దృష్టికి రాత్రి 10.10 గంటల వరకు వెళ్లలేదు. ఈలోపు నష్టం జరిగిపోయింది. మత్స్యకారులు సమాచారమివ్వగానే అధికారులకు తెలియజేసి ఉంటే సెర్చింగ్ ఆపరేషన్ అదే రోజు సాయంత్రం ప్రారంభమయ్యేది. రాత్రి 9 గంటల వరకు బోల్తా పడిన బోటుపై సాయం కోసం మత్స్యకారులు ఎదురుచూశారు. పడవ మునిగిపోతుండటంతో సముద్ర జలాల్లో ఈత కొడుతూ ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. తమకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి వస్తున్నామని సమాచారం వచ్చిందని.. 4 గంటల సమయంలో ప్రమాదంలో చిక్కుకున్నారని భావించి మత్స్యకార సంఘాల నాయకులకు తెలియజేసినట్లు మత్స్యకార మహిళలు చెప్పిన విషయాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మత్స్య శాఖ డీడీకి విషయం తెలియగానే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో కోస్టుగార్డును అప్రమత్తం చేశారు. నౌకలు కాకినాడలో ఉండటంతో ఆదివారం ఉదయం నుంచి గాలింపు చర్యలు మొదలయ్యాయి. మత్స్యకారులు సమాచారం ఇచ్చిన వెంటనే అధికారులకు తెలియజేస్తే మెరుగైన ఫలితాలు ఉండేవని.. సమాచార లోపంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# ఇప్పుడు అయోధ్య..గతంలో వారణాసి

**• దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు • హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు**



**వారణాసి,జూలై8:** ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.

## రామకోటి రాస్తున్నారా- జపం పూర్తి చేసిన తర్వాత పుస్తకాలను ఏమి చేయాలి? ఈ నియమాలు తప్పక తెలుసుకోండి!



: శ్రీరామ నామం తారక మంత్రం. ఈ తారక మంత్రం గొప్పతనాన్ని సాక్షాత్తు పరమశివుడు పార్వతీదేవికి వివరిస్తూ 'తాను ఎల్లప్పుడూ రామ నామాన్ని జపిస్తూ ఉంటానని, 'రామ' అనే ఈ పవిత్రమైన రెండు అక్షరాల నామాన్ని జపించడం వల్ల కలిగే ఫలితం విష్ణు సహస్రనామాలను పఠించడంతో సమానమని తెలిపాడు. "రా", "మ" అనే రెండు అక్షరాలు అద్భుతమైన శక్తిని కలిగి ఉన్నాయి. 'రా' అనే అక్షరం అగ్ని బీజం ఇది అంతఃకరణను ప్రకాశింపజేసేది. 'మ' అనే అక్షరం అమృత బీజం. ఇది మనస్సుకు శాంతిని, ఆనందాన్ని కలిగిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. హిందూ సంప్రదాయంలో భగవంతుని చేరుకునే మార్గాల్లో 'రామకోటి' రాయడం కూడా ఒకటని అంటారు. ఇంతటి మహిమాన్వితమైన రామకోటి రాసేటప్పుడు ఎలాంటి నియమాలు పాటించాలి? రామకోటి పూర్తయ్యాక ఆ పుస్తకాలు ఏమి చేయాలి? అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

రామకోటి విశిష్టతరామకోటి రాయడానికి పూనుకోవడం ఒక సత్కార్యం. ఈ కార్యానికి కొన్ని నియమాలు పాటించాల్సి ఉంటుంది. 'శ్రీరామ' అని పదేపదే రాయడం మనసును శుద్ధి చేస్తుంది, అహాన్ని తొలగిస్తుంది. ఓర్పు, సహన గుణాలను పెంపొందిస్తుంది. రామకోటి రాయడంలో మనస్సును, బుద్ధిని, భక్తిని, చేతిని కేంద్రీకృతం చేస్తూ లిఖించడం వల్ల ఇది కూడా ఒక రకమైన జపం వంటిదే! రామకోటి రాయడానికి ఉన్న నియమాలేంటో చూద్దాం.రామకోటి రాయాలనుకుంటున్నారా! ఈ నియమాలు పాటించండి!రామకోటి రాయాలన్న మీ సంకల్పాన్ని ముందు దేవుడి దగ్గర మానసికంగా విన్నవించుకోండి. శ్రీరామ అని రాసే వీలున్న కోటి గళ్లతో ఉన్న పుస్తకం తెచ్చుకోండి.ఎప్పుడు మొదలు పెట్టాలి? మంచి రోజు చూసుకుని రామకోటి పుస్తకానికి పసుపు, కుంకుమ రాసి దేవుని సన్నిధిలో ఉంచి పుష్పాలతో, శ్రీరామ అష్టోత్తర శతనామావళితో పూజించాలి. విశేషించి శ్రీరామ నవమి, ఉగాది, విజయదశమి, హనుమాన్ జయంతి రోజు నుంచి కానీ ప్రారంభిస్తే ఆటంకాలు లేకుండా రామకోటి పూర్తవుతుందని విశ్వాసం. రాయడం ప్రారంభించే ముందు శ్రీరామకోటి పుస్తకాన్ని భక్తితో కళ్లకు అద్దుకుని రాయడం ప్రారంభించాలి.మనసు కేంద్రీకరించాలి రామకోటి రాసేటప్పుడు ఇతర వ్యాపకాలు, ఆలోచనలు పెట్టుకోకుండా ప్రశాంతమైన మనసుతో, మనసును బుద్ధిని కేంద్రీకరించి రాయాలి.శ్రీరామ నామ జపం ఒక్కో నామం రాసేటప్పుడు 'శ్రీరామ' అని ఉచ్చరిస్తూ రాయడం వల్ల జపం చేసిన ఫలితం కలుగుతుంది.మధ్యలో ఆపవచ్చా! అనుకోకుండా మధ్యలో ఏదైనా పని మీద వెళ్లవలసి వస్తే, సరి సంఖ్యలో రాయడం ఆపి పుస్తకం మూసి నమస్కరించి వెళ్లాలి. పని అయిపోయిన తర్వాత కాళ్లు , చేతులు ని శుచిగా మళ్లీ రాయడం మొదలు పెట్టాలి. అన్ని ప్రత్యేకమే!రామకోటి రాసే పుస్తకం పూజామందిరంలో జాగ్రత్తగా ఉంచాలి. అందులో ఇతర విషయాలు ఏవీ రాయకూడదు. దానికి ఉపయోగించే కలాన్ని కూడా విడిగా ఉంచుకోవడం శ్రేయస్కరం. ఏ సమయంలో రాయాలి?రామకోటి రాయడానికి ప్రత్యేకమైన సమయం అంటూ ఏదీ లేదు. కాని శుచి, శుభ్రత, పవిత్రత, ప్రశాంతత మాత్రం తప్పక పాటించాలి. ఏదో మొక్కుబడిగా పూర్తి చేయాలని కాకుండా ప్రశాంతమైన మనసుతో, సమయం అనుకూలించినప్పుడు మాత్రమే రా యాలి. వేగంగా చేయాలన్న తొందర వద్దు.అక్షర లక్షలుప్రతి లక్ష నామాలకు శ్రీరామునికి ప్రత్యేక పూజ, ఏదైనా తీపి పదార్థం నివేదన చేసి ఈ ప్రసాదాన్ని అందరికి పంచాలి. రామకోటి యజ్ఞం పూర్తయిందా!

రామకోటి రాయడం పూర్తయిన తర్వాత మీ శక్తి అనుసారంగా శ్రీరాముని పూజలు, నివేదనలు అన్నదానం నిర్వహించడం మంచిది.

రామకోటి పుస్తకాలను ఏమి చేయాలి?

రామకోటి రాయడం పూర్తయిన తరువాత రామకోటి పుస్తకాలను ఒక పసుపు బట్టలో కట్టి భద్రాచలంలోని రామచంద్రుడికి కానీ, అయోధ్యలో రామాలయంలో కానీ సమర్పించాలి. వీలు కుదరని వారు తమ సమీపంలోని ఏదైనా రాముని గుడిలో కానీ, ఆధ్యాత్మిక సంస్థకు అప్పగించాలి. అదీ వీలుకాకుంటే గోదావరి, గంగ వంటి పవిత్ర నదులలో విడిచి పెట్టాలి.మహా యజ్ఞంశ్రీరామ కోటి లిఖించడం అనేది సామాన్య విషయం కాదు, ఇది ఒక పవిత్ర యజ్ఞం తో సమానం. ఈ రామనామ లిఖిత జపం వలన పూర్వ జన్మ కర్మలు తొలగిపోయి జీవితంలో సుఖసంతోషాలు, ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించవచ్చు. మనం కూడా ఈ రామకోటి యజ్ఞంలో పాల్గొని సకల శుభాలు పొందుదాం.జైశ్రీరామ్!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది మీ వ్యక్తిగత విషయం.

## అభిషేకం చేస్తే నీలిరంగులో మారే పాలు- రాహు దోషాలను తొలగించే నవగ్రహ క్షేత్రం- నాగనాథ స్వామి విశేషాలివే!





తమిళనాడులో నవగ్రహాలకు ప్రత్యేకంగా ఆలయాలు ఉన్న విషయం తెలిసిందే! నవగ్రహాల క్షేత్రాల దర్శనం వల్ల కొన్ని వేల జన్మల నుంచి పీడిస్తున్న గ్రహదోషాలు తొలగుతాయని పురాణాలు చెబుతున్నాయి. ఎందరో పురాణ పురుషులు ఈ నవగ్రహాల క్షేత్రాలను సందర్శించి గ్రహదోషాల నుంచి విముక్తి పొందిన కథలు ఆధ్యాత్మిక గ్రంథాలలో కోకొల్లలుగా ఉన్నాయి.

**శాస్త్రీయ విజ్ఞానానికి అందని రహస్యాలు**

హిందూ సంప్రదాయంలో దేవీదేవతలతో పాటు నాగసర్పాలుకు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. మన పురాణాల్లో కూడా నాగ లోకం, నాగినీలు నాగదేవలు, నాగమణి ప్రస్తావన వినిపిస్తూనే ఉంటుంది. అయితే అవన్నీ ఒట్టి అభూతకల్పనలే అని కొట్టిపడేసే హేతువాదులు కూడా ఉన్నారు. అయితే శాస్త్రీయ విజ్ఞానానికి అందని వింతలు, శాస్త్రజ్ఞులు చెందించని రహస్యాలు ఉన్న దేవాలయాలు భారతదేశంలో ఎన్నో ఉన్నాయి.

**సైన్స్ కు అందని అద్భుతాలు మన ఆలయాలు**

ఎందరో శాస్త్రజ్ఞులు, ఎన్నో పరిశోధనలు చేసి కొన్ని ఆలయాలు సైన్స్ కు అందని అద్భుతాలు అని తేల్చి చెప్పిన విషయాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అలాంటి ఆలయాల్లో ఒకటి రాహువు ఆలయం. రాహువుకు చెందిన ఈ ఆలయం నాగనాథస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. తమిళనాడులోని తొమ్మిది నవగ్రహ ఆలయాలలో ఒకటైన ఈ ఆలయం కుంభకోణం నగరం నుంచి తూర్పు దిక్కున 7 దూరంలో ఉన్న తిరునాగేశ్వరంలో ఉంది.

**తిరునాగేశ్వరం నాగనాథ ఆలయ విశేషాలు**

తిరునాగేశ్వరం నాగనాథస్వామి ఆలయంలో పరమేశ్వరుడు నాగనాథస్వామిగా తన సతి గిరి గుజాంబికతో కలిసి వెలసి ఉన్నాడు. ఈ క్షేత్రంలో ప్రధాన దైవమైన నాగనాథస్వామికి ఇరువైపులా సరస్వతి, లక్ష్మీదేవి వెలసి విశేషం.

**భార్యలతో వెలసిన రాహువు**

తిరునాగేశ్వరం నాగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక మందిరంలో వెలసిన రాహు భగవానుని దర్శించుకోవచ్చు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇక్కడ రాహువు ఇద్దరు భార్యలు నాగకన్నె, నాగవల్లితో కలిసి దర్శనమిస్తాడు. రాహువు ఒక శాపం నుంచి విముక్తి పొందటానికి ఈ ఆలయంలో శివుని పూజించాడని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. సాధారణంగా ఇతర నవగ్రహ దేవాలయాలలో రాహువు సర్ప ముఖంతో దర్శనమిస్తే, నాగనాథ్ స్వామి ఆలయంలో మాత్రం రాహువు మానవ ముఖాన్ని కలిగి ఉండటం విశేషం. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం నాగ దోష పరిహారం చేసే ఒకే ఒక్క ఆలయంగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది.


**ఆకట్టుకునే చోళుల నిర్మాణ శైలి!**

ఈ ఆలయంలో రాహుభగవానుని విగ్రహం నైరుతి మూలలో ఉంది. ఆలయ ప్రాంగణంలో కొన్ని మండపాలు, బురుజుల గోపురాలు, ఎత్తైన ప్రాకారాలు ఉన్నాయి. చూడటానికి కోట గోడల్లా ఉండి, బయటి ప్రాకారాలతో కలిసి ఉన్న 4 ప్రవేశ బురుజులను చూడవచ్చు. దక్షిణం వైపున 4 మండపాలతో కూడి చుట్టూ రథం రూపంలో 100 స్తూపాల మండపం ఉన్న ఒక చెరువును చూడవచ్చు. ఈ ఆలయ నిర్మాణం చోళుల శైలిని పోలి ఉంటుంది.

**నీలిరంగులో మారే పాలు**

ఈ ఆలయంలో ప్రధానంగా పూజలందుకుంటున్నది రాహువు. నాగదోషంతో బాధపడేవారు రాహుకాలంలో రాహువు విగ్రహం మీద పాలు పోస్తే, అవి నీలి రంగులోకి మారి, కిందకు జారి పడిన తర్వాత మళ్ళీ తెల్లని పాల రంగులోకి మారతాయి. రాహు దోషం ఉన్నవారు, నాగ దోషం ఉన్నవారు ఈ ఆలయంలో రాహుకాలంలో రాహుభగవాన్ కి పాలాభిషేకం చేస్తున్నప్పుడు ఆ పాలు కంఠం నుంచి దిగగానే, గొంతు వద్ద నీలం రంగు గా మారుతుంది. అనంతరం ఆ పాలు నేలపై పడినప్పుడు తెల్లగా కావడం విశేషం. ఈ వింతను చూడడానికి రాహుకాలంలో భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. రాహువు విగ్రహంపై పోసిన పాలు నీలిరంగులోకి మారి ప్రతి ఒక్కరికి కనబడటం ఈ ఆలయం లోని ఒక ముఖ్య విశేషం.నాగమణినే కారణమా?ఇలా పాలు నీలి రంగులోకి మారడానికి నాగమణినే కారణమని పురాణాల కథనం. విష్ణు పురాణం, గరుడ పురాణంలో కూడా ఈ నాగమణి ప్రస్తావన ఉంది.ఎలా చేరుకోవాలి?ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని దర్శించుకోవడానికి వెళ్లాలంటే శనివారం ఉదయం 9 గంటల నుంచి 10:30 లోపు కానీ, ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6:30 మధ్యలో కానీ వెళ్లాలి. కుంభకోణం వరకు దేశంలో అన్ని ప్రాంతాల నుంచి రైలు సౌకర్యాలున్నాయి. అక్కడ నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరునాగేశ్వరం ఆలయానికి సులభంగా చేరుకోవచ్చు.మనం కూడా తిరునాగేశ్వరం ఆలయాన్ని సందర్శించి సకల గ్రహ దోషాలు నుంచి విముక్తి పొందుదాం.ఓం రాహవే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చునన్నే

## జుట్టు ఎక్కువగా రాలిపోతోందా - ఈ ఆయుర్వేద చిట్కాలు మేలు చేస్తాయట!



కేవలం అనారోగ్య సమస్యలకు పరిష్కారాలు మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాన్ని కూలంకషంగా పేర్కొంది ఆయుర్వేద శాస్త్రం. కేవలం ఆరోగ్య పరంగా మాత్రమే కాదు జుట్టు సమస్యలకు ఆయుర్వేదంలో చికిత్సలు ఉన్నాయి. ఈ క్రమంలోనే జుట్టు రాలడం తగ్గి, ఒత్తుగా, పొడవుగా పెరగడానికి ఉపయోగపడే కొన్ని ముఖ్యమైన ఆయుర్వేద చిట్కాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!నూనెతో మసాజ్ : క్రమం తప్పకుండా తలను నూనెతో మసాజ్ చేయడం అనేది ఆయుర్వేదంలో అత్యంత ఉత్తమమైన అలవాటు. దీని వల్ల జుట్టుకే కాకుండా మొత్తం శరీరానికి, మనస్సుకు ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు చేకూరుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొబ్బరి, నువ్వుల లేదా బాదం నూనెతో మసాజ్ చేయడం వల్ల తలలో రక్త ప్రసరణ మెరుగవుతుందని చెబుతున్నారు. ఫలితంగా, కుదుళ్లకు అవసరమైన పోషకాలు అంది, జుట్టు రాలడం తగ్గిపోతుందని పేర్కొంటున్నారు. అలాగే, జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం లాంటి సమస్యలు తగ్గుతాయని తెలియజేస్తున్నారు. కొబ్బరి నూనె వెంట్రుకలపై ఒక రక్షణ పొరను ఏర్పరిచి, క్యూటికల్ (వెంట్రుక పైపొర)ను మూసివేయడం ద్వారా హెయిర్ రిన్స్ : తలస్నానానికి శీకాకాయ్, కుంకుడుకాయలు, ఉసిరికాయ వంటి సహజ పదార్థాలను ఉపయోగించడం వల్ల స్కాల్ప్ ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి స్కాల్ప్ జుట్టు స్వాభావిక సమతుల్యం చేయడానికి, చుండ్రును నియంత్రించడానికి సహాయపడతాయని అంటున్నారు. అంతేకాదు, కురులను సహజంగా మృదువుగా, ఆరోగ్యంగా ఉంచుతాయట.సమతులాహారం, నీరు : విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగడం వల్ల జుట్టుకు లోపలి నుంచి పోషణ అందుతుందని నిపుణులు చెబుతున్నారు. గింజలు, విత్తనాలు, ఆకుకూరలు, పండ్ల వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల జుట్టు దృఢంగా ఉంటుందని అంటున్నారు. అలాగే, చిన్నవయసులోనే జుట్టు తెల్లబడకుండా ఉంటుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల జుట్టు మందం, స్థితిస్థాపకతకు తోడ్పడుతుందని వివరిస్తున్నారు.డ్రయర్ వద్దు : హీట్ స్టైలింగ్ పరికరాలు జుట్టును తాత్కాలికంగా అందంగా మార్చినప్పటికీ, తీవ్రచెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, వైన వేడివల్ల జుట్టులోని సహజ తేమ, కెరాటిన్ ప్రోటీన్ దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం, విపరీతంగా రాలిపోతుందని హెచ్చరిస్తున్నారు. అందుకే, తలస్నానం చేసిన తర్వాత జుట్టును ఫ్యాన్‌చెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, ? గాలికి ఆరనివ్వాలని సూచిస్తున్నారు. హెయిర్ డ్రయర్ వాడడం హెయిర్ స్టైల్? జుట్టును బిగుతుగా లాగి వివిధ హెయిర్ స్టైల్స్ వేసుకోవడం వల్ల కుదుళ్లు బలహీనపడతాయ ట. దీంతో జుట్టు ఎక్కువగా రాలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే, ఇంట్లో ఉన్నప్పుడు లేదా రాత్రి పడుకునే ముందు జుట్టును లూజ్?గా జడ వేసుకోవడం చాలా మంచిదని అంటున్నారు. ఇది జుట్టు చిక్కుబడకుండా, రాలిపోకుండా చేస్తుందని తెలియజేస్తున్నారు.తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ : నిద్ర, మానసిక ప్రశాంతత అనేవి కేవలం ఆరోగ్యానికే కాదు, ఒత్తుగా పెరిగే జుట్టుకు కూడా అత్యంత ముఖ్యమంటున్నారు నిపుణులు . మానసిక ఒత్తిడి పెరిగినప్పుడు శరీరంలో కార్టిసాల్ స్థాయిలు పెరుగుతాయట. ఇవి జుట్టు కుదుళ్లను బలహీనపరచడం, జుట్టు రాలడానికి, తెల్లబడటానికి కారణమవుతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, లోతైన శ్వాస వంటి పద్ధతులు ఒత్తిడి వల్ల జుట్టు రాలిపోవడాన్ని తగ్గిస్తాయని సూచిస్తున్నారు. అలాగే, సాధారణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని సలహా ఇస్తున్నారు.సూర్యరశ్మి నుంచి రక్షణ : సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు జుట్టులోచెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, ని కెరాటిన్ ప్రోటీన్‌ను దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. దీంతో జుట్టు పొడిబారడం, రంగు మారిపోవడం, చిట్లిపోతాయని చెబుతున్నారు. ఈ క్రమంలో జుట్టుకు నూనెను రాసుకోవడం, టోపీలు లేదా స్కార్ఫ్?లు ధరించడం వల్ల కురులకు యూవీ కిరణాల నుంచి రక్షణ లభిస్తుందని సూచిస్తున్నారు. తద్వారా జుట్టు రంగు మారకుండా ఉంటుందని ఎచెబుతున్నారు. ఈ క్రమంలో ధ్యానం, యోగా, లహా ఇస్తున్నారు.చీరిజా : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ఐఫోన్ 18 సిరీస్ లాంచ్ డేట్ లీక్.. భారీగా పెరగనున్న ధరలు!



యాపిల్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'ఐఫోన్ 18 సిరీస్' (అక్టోబర్ 18 వతీతవం) ఈ ఏడాది సెప్టెంబర్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ నెక్స్ట్-జనరేషన్ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌ల లాంచ్ తేదీని యాపిల్ సంస్థ ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, సెప్టెంబర్ రెండో వారంలో ఇవి మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రముఖ జర్నలిస్ట్ అంచనా వేశారు.కొత్త లైనప్ (ఫోల్డబుల్ ఐఫోన్): ఈ 2026 ఐఫోన్ లైనప్‌లో ఐఫోన్ 18 ప్రో ఐఫోన్ 18 ప్రో మాక్స్ లతో పాటు, యాపిల్ మొట్ట మొదటి ఫోల్డబుల్ ఐఫోన్ 'ఐఫోన్ అల్ట్రా' () కూడా ఉండే అవకాశం ఉందని రూమర్స్ వినిపిస్తున్నాయి.భారీగా పెరగనున్న ధరలు: ఒక మార్కెట్ రీసెర్చ్ సంస్థ అంచనా ప్రకారం.. యాపిల్ ఐఫోన్ ధరల పెంపు ధోరణిని బట్టి చూస్తే, రాబోయే ఐఫోన్ 18 ప్రో మోడల్స్ ధరలు మునుపటి కంటే (భారీగానివిగా) ఉండవచ్చని తెలుస్తోంది.

ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ అల్ట్రా లాంచ్ టైమ్‌లైన్: బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన మార్క్ గుర్మాన్ తన 'పవర్ ఆన్' న్యూస్‌లెటర్ తాజా ఎడిషన్‌లో యాపిల్ ఐఫోన్ లాంచ్ ఈవెంట్లు సాధారణంగా అమెరికాలో లేబర్ డే హాలిడే తర్వాత, సెప్టెంబర్‌లోని మొదటి మంగళవారం లేదా బుధవారం జరుగుతాయని తెలిపారు. ఈ షెడ్యూల్ వల్ల సెప్టెంబర్ మధ్య నాటికి అమ్మకాలు ప్రారంభించడానికి, క్వార్టర్ ముగిసేలోపు ఆదాయాన్ని గుర్తించడానికి, అలాగే హాలిడే షాపింగ్ సీజన్‌కు ముందే రిటైల్ ఛానళ్లలో స్టాక్ ఉంచడానికి టెక్ దిగ్గజానికి తగినంత సమయం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.బ్లూమ్‌బెర్గ్ జర్నలిస్ట్ మార్క్ గుర్మన్ అంచనా ప్రకారం, ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్?లతో పాటు మొదటి ఫోల్డబుల్ మోడల్ 'ఐఫోన్ అల్ట్రా' లాంచ్?కు సెప్టెంబర్ 8 అత్యంత అనుకూలమైన తేదీ కావచ్చు.అమెరికాలో ఈ ఏడాది సెప్టెంబర్ 7న 'లేబర్ డే' హాలిడే ఉంది. ఈ కారణంగా, యాపిల్ తన గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌ను సెప్టెంబర్ 9న కూడా నిర్వహించే అవకాశం ఉంది. ఈవెంట్‌కు హాజరయ్యే వారికి ప్రయాణించడానికి ఒక రోజు అదనంగా సమయం దొరుకుతుందనే ఉద్దేశంతో యాపిల్ ఈ నిర్ణయం తీసుకోవచ్చని నివేదికలు చెబుతున్నాయి.ముఖ్యంగా, యాపిల్ గతంలో కూడా ఇదే విధమైన షెడ్యూల్‌ను అనుసరించింది. 2025లో తన మునుపటి జనరేషన్ 'ఐఫోన్ 17 సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లను కూడా సెప్టెంబర్ 9వ తేదీనే అధికారికంగా లాంచ్ చేసింది.లాంచ్ డేట్‌తో పాటు, రాబోయే ఐఫోన్ 18 లైనప్ ధర గురించి కూడా మార్కెట్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇటీవల యాపిల్ సీఈవో టిమ్ కుక్ మాట్లాడుతూ.. విడిభాగాల భారీగా పెరుగుతున్నప్పటికీ, ఆ భారాన్ని కస్టమర్లపై పడకుండా ఇప్పటివరకు కాపాడుతూ వచ్చామని తెలిపారు. అయితే, భవిష్యత్తులో ఈ అదనపు ఖర్చులను కంపెనీయే పూర్తిగా భరించడం సాధ్యం కాకపోవచ్చని ఆయన స్పష్టం చేశారు.దీనికి తగ్గట్టుగానే, యాపిల్ సంస్థ ఇప్పటికే మ్యాక్ కంప్యూటర్స్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్, యాపిల్ టీవీ, హోమ్‌పాడ్ వంటి వివిధ కేటగిరీల డివైజ్‌ల ధరలను పెంచింది. అయితే ఇప్పటివరకు ఇండియా, లేదా గ్లోబల్ మార్కెట్లలో ఐఫోన్ల ధరలను మాత్రం యాపిల్ ఇంకా పెంచలేదు. ఈ నేపథ్యంలో రాబోయే ఐఫోన్ 18 సిరీస్‌తోనే ఆ ధరల పెంపు మొట్టమొదటిసారిగా ఉండబోతోందని మార్కెట్ వర్గాల అంచనా.ప్రముఖ మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఐడీసీ (ఐడీసీ), అప్?కమింగ్ ఐఫోన్ 18 లైనప్ ధరలపై సరికొత్త అంచనాను విడుదల చేసింది (జిఫు షిఫి=బువీశీఖు). ఈ నివేదిక ప్రకారం, ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడల్స్ ధరలు ప్రస్తుతం ఉన్న మోడల్స్ కంటే ఏకంగా వి200 (సుమారు రూ. 18,800) వరకు పెరిగే అవకాశం ఉంది.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు



- సర్వే పూర్తయ్యాకే దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
- పాఠశాలల్లో నాణ్యమైన విద్య పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్ ద

**భద్రాద్రి కొత్తగూడెం**

ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సర్వే పూర్తయ్యాకే దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అలాగే పాఠశాలల్లో నాణ్యమైన విద్య పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించడంతో పాటు గుట్టగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన ఓటర్లు ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు మరణించిన ఓటర్ల వివరాలను ప్రత్యేక జాబితాల రూపంలో సిద్ధం చేసి అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయిన అనంతరం మాత్రమే సేకరించిన దరఖాస్తు ఫారాలను యాప్‌లో



అప్‌లోడ్ చేయాలని ధృవీకరించని లేదా అసంపూర్ణ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అప్‌లోడ్ చేయరాదని స్పష్టం చేశారు. ప్రజలు ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు తొలగింపులు సకాలంలో చేయించుకోవాలని సూచించారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం గుట్టగూడెం గిరిజ న ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు హాజరు విద్యాబోధన ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రధానోపా ధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తు తం పాఠశాలలో మొత్తం 15 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు ప్రధానోపా ధ్యాయులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భోజన నాణ్యత పరిశుభ్రత మెనూ ప్రకారం ఆహారం అంది స్తున్న తీరును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వ కుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచిం చారు. తరగతి గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని అన్నారు. అలాగే పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నత్తనడకన సాగుతున్న "సర్" జనాభా గణన ప్రక్రియ



- ఓటర్లందరికీ అందని "సర్" ఫారాలు
- "సర్" ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వరా
- గడువులోగా లక్ష్యాన్ని చేరడం అసాధ్యమే.


**తొర్రూరు, :**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనాభా గణన ప్రక్రియలో భాగంగా ఓటర్లకు ఇస్తున్న "సర్" ఫారాలు ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా అధిక శాతం ఓటర్లకు అందలేదని, క్షేత్ర స్థాయిలో ఎక్కడికి వెళ్ళినా "సర్" ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వరా అని ప్రజలం దరూ అడుగుతున్నారని, ఈ ప్రక్రియ నత్తకు నడక నేర్పినట్లుగా ఉందని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీ మరియు మండల పరిధిలోని పలు వారులు, గ్రామాల్లో ఇట్టి విషయ పరిశీలన కోసం ప్రాథమికంగా మూడు రోజులు పర్యటించిన దొనికెన తాను సేకరించిన సమాచారాన్ని బుధవారం నాడు మండల పరిషత్ మీటింగ్ హాలులో జరుగుతున్న "సర్" సమీక్షా సమావేశంలో విజ్ఞాపన పత్రంగా స్థానిక ఎమ్మార్వోకు అందించిన అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయబడి, సంబంధిత ఓటర్ల చేత సక్రమంగా నింపబడి, బీఎల్వోల చేత సేకరింపబడి, స్కాన్ ద్వారా నమోదు చేయడానికి గడువు ఈ నెల 24 చివరి తేదీ ఉండడం వల్ల, ఇందుకు ఇంకా రెండు వారాలే మిగిలి ఉన్నాయని, ఇప్పటికే రెండు వారాలు గడిచినా కనీసం 50 శాతం కూడా పూర్తి కాని ఫారాల పంపిణీతో ఈ కార్యక్రమం ఎంతవరకు విజయవంతం అవుతుందని, "సర్" సమస్యల పరిష్కారా నికి వీలైనంత త్వరగా తగిన చర్యలు తీసుకొనుటకు సంబంధిత యంత్రాంగాన్ని అప్ర మత్తం చేయాలని లేదంటే గడువును పెంచే అవకాశాన్ని పరిశీలించాలనిదొనికెనకోరారు.

# ప్రధాన వైద్యశాలకు చికిత్స అవసరం

- సమస్యలకు నిలయం
- ఆసుపత్రికి డాక్టర్ల కొరత
- మందుల సప్లై చేయక రోగులు ఇబ్బందులు
- రక్త పరీక్షలు సరిగ్గా చేయక ప్రజల ఆవేదన
- సిపిఎం సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి

సమస్యల తీరును వివరించిన సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు





**భద్రాద్రి కొత్తగూడెం :**

పేరుకే సర్కార్ దవాఖాన నిలిచిందని అనేక సమస్యలు ఆసుపత్రిలో నెలకొని ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఇటీవల సిపిఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా హాస్పిటల్ లో ఉన్న సమస్యలు కుప్పలు తెప్పలుగా వెలుగులోకి వచ్చాయని బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలియజేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో గుండె కిడ్నీ నరాల సంబంధించిన డాక్టర్లు లేరని అసలు ఆ విభాగమే హాస్పిటల్ లో పనిచేయడం లేదని ఆయన అన్నారు. దీని వలన గుండె కిడ్నీ నరాలకు సంబంధించిన సమస్య వస్తే ప్రజలు ఖమ్మం గాని హైదరాబాదు లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల నుండి హాస్పిటల్ కి సిరంజీల సప్లై లేదని దీనివలన ప్రైవేటు మెడికల్ షాప్‌లను ఆశ్రయించి డబ్బులతో మెడిసిన్ సిరంజీలు కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. తాము సర్వే చేసిన రోజున సిరంజీలు లేవని రక్త పరీక్షలు కూడా చేయకుండా రోగులను వెనక్కి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 173 డాక్టర్ పోస్టులకు గాను కేవలం 40 మంది మాత్రమే ఉన్నారని వీరిలో 15 మంది తాత్కాలిక డాక్టర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. జిల్లా కేంద్రం హాస్పిటల్ లో డాక్టర్ల కొరత ఈ విధంగా ఉంటే ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యం ఎలా అందుతుందని ఆయన ప్రశ్నించారు. అంబులెన్సు ఐదు అవసరం కాగా కేవలం రెండు అంబులెన్స్ మాత్రమే పనిచేస్తున్నాయని దీనివలన అత్యవసర పరిస్థితుల్లో రోగులు హాస్పిటల్ కి రావాలంటే తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్పిటల్లో మంచినీటి సౌకర్యం సక్రమంగా లేదని హాస్పిటల్ విస్తరించిన తర్వాత హాస్పిటల్ డ్రైనేజీ వాటర్ బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు ఏర్పడి మురుగునీరు నిల్వ ఉండి హాస్పిటల్ చుట్టుపక్కల రోడ్లమీదకు వస్తున్నాయని దీనివలన హాస్పిటల్ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చర్మ వ్యాధులు కంటి వైద్యానికి సంబంధించి ఒక చిన్న రూమ్ లో ఓపి ఏర్పాటు చేశారని దీని వలన పేషెంట్లు అలాగే డాక్టర్ కూడా ఇబ్బంది పడుతున్నారని ఇది తమ దృష్టికి వచ్చినట్లు తెలియజేశారు. రోజుకు సుమారు ఆరు వందల మంది ప్రజలు హాస్పిటల్ కి వస్తుండగా నడవడం చేతకాని వారిని స్ట్రెచ్చర్ మీద తీసుకెళ్లాలంటే అంత పెద్ద హాస్పిటల్ లో కేవలం మూడు స్ట్రెచ్చర్స్ మాత్రమే ఉన్నాయని అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేయకపోవడం వలన రక్త పరీక్షలు సిటీ స్కానింగ్ వంటి పరీక్షలు చేయడానికి డాక్టర్ల కొరత ఏర్పడిందని దీనివలన సౌకర్యాలు ఉన్న వాటిని ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నిర్మించే హాస్పిటల్ నిర్మాణం నత్తనడకన నడుస్తుందని తెలిపారు. తక్షణమే నూతన భవన నిర్మాణాన్ని పూర్తిచేసి మెడికల్ కాలేజీ కనుబంధంగా నూతన జిల్లా కేంద్ర ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తక్షణమే హాస్పిటల్ సమస్యలు పరిష్కారానికి నిధులు కేటాయించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వైద్య రంగాన్ని పట్టించుకోని జిల్లా మంత్రులు జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా జిల్లా కేంద్ర ఆసుపత్రిని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య విమర్శించారు. కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్లు హాస్పిటల్ సందర్శించుతున్నారు తప్ప సమస్యకు పరిష్కారం చూపట్లేదని ఆయన ఆరోపించారు. వైద్య విధాన పరిషత్ నుండి డిఎంఈ పరిధిలోకి వచ్చినప్పటికీ పేరు మార్పే తప్ప సౌకర్యాలలో అభివృద్ధి మాత్రం కనబడడం లేదని విమర్శించారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధుల నుండి ప్రజలను కాపాడడానికి సరైన వైద్య సదుపాయం అందించాలని మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ కార్య దర్శివర్గ సభ్యులు నందిపాటి రమేష్ టౌన్ కమిటీ సభ్యురాలు అన్నవరపు ఇందిరా నాయ కులు బాలకృష్ణ రాములు రఘు, నాగమణి రేణుక సలీం తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ కార్యకలాపాలపై అవగాహన



**భద్రాద్రి కొత్తగూడెం :**

సింగరేణి సంస్థ విజిలెన్స్ విభాగం కోల్ ఇండియాలో విజిలెన్స్ డిపార్ట్మెంట్ ల పనితీరుపై అవగాహన కల్పించటానికి సింగరేణి సంస్థ, కోల్ ఇండియా లిమిటెడ్ సంయుక్తముగా సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న జాదవ్, అధ్యక్షతన బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సింగరేణి విజిలెన్స్ సిబ్బంది తో కోల్ ఇండియా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బ్రజేష్ కుమార్ త్రిపాటిచే పరస్పర అవగాహన కార్యక్రమం జరిగింది. ముందుగా సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.వెంకన్న జాదవ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఆవిర్భావం ఏరియాల వారీగా ఉన్న ఉపరితల భూగర్భ గనుల గురించి ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి రవాణా టర్నోవర్ సంస్థ వృద్ధి రేటును బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి విజయవంతంగా అడుగుపెట్టిందని వివరించారు. అనంతరం సింగరేణి సంస్థలో వివిధ అంశాలపై విజిలెన్స్ విభాగం నిర్వహించే విధి విధానాల గురించి వివరించారు. తదుపరి కోల్ ఇండియా లిమిటెడ్ లో అవలంబించే విధి విధానాలపై కోల్ ఇండియా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బ్రజేష్ కుమార్ త్రిపాటిచే సంస్థలో పనిచేసే విజిలెన్స్ అధికారులకు ఉద్యోగులకు పరస్పర అవగాహనా కల్పించారు. సింగరేణి సంస్థలో విజిలెన్స్ విభాగం నిర్వహించే కొన్ని ప్రాముఖ్యమైన విషయాలను ప్రశంసిస్తూ అట్టి విషయాలను కోల్ ఇండియాలో అమలుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతే కాకుండా కోల్ ఇండియా అనుబంధ సంస్థలలో విజిలెన్స్ విభాగాలు చేపట్టిన ముఖ్యమైన కార్యకలాపాలను సింగరేణి సంస్థలో అమలుపచటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమములో కోల్ ఇండియా జిఎం(విజిలెన్స్) ఎన్.ఆర్.శ్రీవాస్తవ, జిఎం అండ్ టిఎస్ టు సివిఓ సిఐఎల్ అవినాష్ మదన్వాడ్, సింగరేణి విజిలెన్స్ హెచ్ఓడి (విజిలెన్స్)ఎస్.వి.మురళీధర్ రాజు, సింగరేణి విజిలెన్స్ అధికారులు విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య విభాగంలో నవ లిమిటెడ్ సేవలు అభినందనీయం

- నవలిమిటెడ్ ఎల్.వి.పి.ఐ ఆధ్వర్యంలో
- విద్యార్థులకు కంటి వైద్య సేవలు



**భద్రాద్రి కొత్తగూడెం :**

పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా నవలిమిటెడ్, ఎల్.వి.పి.ఐ సంయుక్తంగా పాల్వంచ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల పరిషత్ హైస్కూల్ ఎర్రగుంట నందు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా డి.వాసంతి, జిల్లా విద్యశాఖధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపాయలు కల్పించడంలో 'నవ' లిమిటెడ్ కృషిని కొనియాడారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ యన్ సురేష్ చంద్ర, ఎల్.వి.ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ సి.దేవి చంద్రరావు, సి.ఎస్.ఆర్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్.ఎమ్ పి.సుధారాణి, పాఠశాల సిబ్బంది, సిఎస్.ఆర్ సిబ్బంది, నవభారత్ కంటి వైద్య సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ రద్దు చేస్తే కాంగ్రెస్ సర్కార్ పీఠాలు కూలుతయ్ బీసీ సంఘాల నేతల హెచ్చరిక



**హైదరాబాద్:** నేడు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ సమస్య-భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటకొండ విక్రమ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ (బీసీ జేఏసీ చైర్మన్) బండారు దత్తాత్రేయ (హర్యానా మాజీ గవర్నర్), సిరికొండ మధుసూదనాచారి, ఎల్ రమణ (బీఆర్ఎస్) నెల్లికంటి సత్యం (సిపిఐ) నిజ్జన రమేష్ (టీజేఎస్) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఫీజు రియంబర్స్‌మెంట్ రద్దు చేసి కాంగ్రెస్ బీసీల ద్రోహానికి పాల్పడుతుందని, బీసీలకు అన్యాయం చేయాలని ఉద్దేశంతోనే రాష్ట్ర హైకోర్టులో ఫీజు రియంబర్స్‌మెంట్ కేసులో కనీసం అడ్వకేట్ జనరల్ హాజరు కాకుండా కావాలనే ఫీజుల రద్దుకు సంబంధించిన తీర్పు రావాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తలేదని ఈ విద్యా సంవత్సరం జరిగే ఇంజనీరింగ్ అడ్మిషన్లు ఉత్తీర్ణత అయిన 50వేల మంది బడుగు విద్యార్థులు ఇంజనీరింగ్ కౌన్సిల్ లో పాల్గొనలేదని ఆయన తెలిపారు, ఇటీవల ప్రపంచ బ్యాంక్ భారతదేశంలో మొదటి ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణ అని ప్రకటిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఖజానా ఖాళీ అనడం వారి దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు, 9 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న ప్రభుత్వ స్పందించడం లేదని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల సత్తా ఏందో చూపించడానికి ఈనెల 20వ తేదీన హైదరాబాదులో విద్యార్థుల మిలియన్ మార్చ్ నిర్వహించి తీరుతామని హెచ్చరించారు.

## బాధితులకు చిత్తశుద్ధితో న్యాయం చేయాలి




- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం :**

ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్, స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు జిఆర్ఎం, ఎంఆర్ఎం సంబం ధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల్లో ప్రమేయం లేకపోయినా దర్యాప్తు ప్రక్రియలో బ్యాంకు ఖాతాలు లేదా నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జిఆర్ఎం ద్వారా తమ వినతులను సంబంధిత బ్యాంకులకు సమర్పించుకోవచ్చని సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు అర్హులైన వారి బ్యాంకు ఖాతాలను డీ-ఫ్రీజ్ చేయడం లేదా ఫ్రీజ్ అయిన నగదును విడుదల చేసే చర్యలు చేపడతారని వివరించారు. అలాగే సైబర్ మోసాలకు గురైన బాధితులకు కోల్పోయిన నగదును త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఎంఆర్ఎం మాడ్యూల్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రూ.50,000 లోపు అర్హత కలిగిన ఫ్రీజ్ అయిన మొత్తాన్ని కోర్టు ఉత్తర్వులు లేకుండానే నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం బాధితులకు తిరిగి అందించే అవకాశం ఈ విధానంలో ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్ జిఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్లను సమర్థవంతంగా వినియోగించి ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. బ్యాంకులు దర్యాప్తు అధికారులతో సమన్వయం పెంచి సైబర్ నేరాల బాధితులకు వేగంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ జితేందర్, పోలీసు అధికారులుసైబర్‌వారియర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం..

- వారు చెప్తే ఏ పనైనా ఇట్టే అయిపోతుందా..
- ఏ పని జరగాలన్న పైసలు ఇవ్వాల్సిందేనా..
- లేకుంటే ఏదో ఒక్క కొర్రీలు పెట్టి.. రిజెక్టే నట..
- అధికారుల పనితీరుపై విసుకు చెందుతున్న ప్రజలు
- కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి..




**దోమ జూలై 09 :** పైసలిస్తే ఎలాంటి పనైనా చేపిస్తా. అధికారులకు నేను ఎంత చెప్తే అంతే మీ భూములపై కేసులు ఉన్న ఇంకేమైనా ఉన్న ఆ పనులన్నీ పూర్తి చేయిస్తా.. కానీ అడిగిన కాడికి పైసలు ఇవ్వాలని అమాయక ప్రజలను మోసం చేస్తూ వారి నుండి వేలకు వేలు పైసా వసూళ్లకు పాల్పడుతున్న మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ వ్యక్తులు కార్యాలయం తెరిచినప్పటి నుండి తిరిగి మోసేంతవరకు కార్యాలయంలోనే ఉంటూ ఎవరైనా చేతిలో కాగితాలు పట్టుకొని రెండు మూడు రోజులు కార్యాలయం చుట్టూ తిరిగింద్రంటే అంతే సంగతి.. వారితో మాట మాట కలిపి వారి సమస్య తెలు సుకొని మీ పనులు చేయిస్తా నాకు అధికారులకు ఇంత ఇవ్వాలని మొహమాటం లేకుండా వారి దగ్గర డబ్బులు డిమాండ్ చేస్తూ అధికారులను మేనేజ్ చేస్తూ వారి పనులు పూర్తి చేయిస్తున్నాడని ఆరోపణలు బలంగా ఉన్నాయి. రూపాయి ఖర్చు లేకుండా అయిపోయే పనులకు సైతం పైసలు ఇవ్వకుంటే ఇలాగే కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. డబ్బులు ఇస్తే ఒక్క రోజులో చేపిస్తానని ప్రజల నుండి పైసలు తీసుకుంటున్నట్టు బలమైన ఆరోపణలు ఉన్నాయి అధికారులు సైతం ఇతను ఏం చెప్తే అది ఇట్టే చేసేస్తారని గుసగుసలు వినిపిస్తు న్నాయి. అమాయక ప్రజలు అతన్ని చూసి వారిని కూడా కార్యాలయంలో ఓ ఉద్యోగి అనుకోని సార్ అంటూ అతను చుట్టూ తిరుగు తున్నారట.. తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల పనితీరు ప్రస్తుతం తీవ్ర విమర్శలకు గురవుతోంది. గత కొన్నేళ్లుగా ఓ పార్టీ పేరు ఓ బడా నేత పేరు చెప్పుకుంటూ కార్యాలయంలో చలామణి అవుతూ. అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుం టున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. డబ్బులు ఇస్తే ఎలాంటి పనైనా చేపిస్తానని అమాయక ప్రజలకు మాయ మాటలు చెబుతూ ఒక్క రోజులోనే వేలకు వేలు వసూలకు పాల్పడుతున్నాడు.. వికారాబాద్ జిల్లా దోమ మండల తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతుంది పైసలు చేతిలో పడందే పనులు కావని, రోజు రోజుకి ప్రజలను పీడించే అధికారులు ఎక్కువవుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా తహసీల్దార్ కార్యాలయం మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. దళారులు పైరవీకారులు లేనిదే కార్యాలయంలో పనులు జరగవని కచ్చితంగా దళారితో వెళితే మాత్రమే పనులు జరుగుతాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అప్పుడు ధరణి ఇప్పుడు భూ భారతి, వచ్చిన తర్వాత దళారులు ఎక్కువయ్యారు. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేసి ప్రజలను నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఏ పని కావాలన్నా పైరవీకారులు చెప్పాలి. అధికారులకు ముడుపులు అందజేస్తే ఏ పని అయినా సాధ్యం అనే విదంగా పనులు జరుగుతున్నాయి. పైసా లేనిదే పని కాదు చిన్న స్థాయి ఉద్యోగి నుంచి అధికారి వరకు ముడుపులు చెల్లించాల్సిందనే ఆరోపణలు ఉన్నాయి.

**- అధికారుల కంటే ప్రైవేట్ వ్యక్తులే పవర్‌ఫుల్‌నా..?**

తహసిల్దార్ కార్యాలయంలో ఆ ప్రైవేట్ వ్యక్తుల అధికారుల తరహాలో వ్యవహరిస్తూ ప్రజలతో మాట్లాడటం ఫైళ్లు తీసుకోవడం, సూచనలు ఇవ్వడం వంటి చర్యలు చేయడం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. “అసలు ప్రైవేట్ వ్యక్తి ఫైళ్లు హ్యాండిల్ చేయడం, ప్రజల దరఖాస్తులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఎవరు పైసలు ఇస్తే వారి ఫైలు ముందుకు వెళుతుంది పైసలు ఇవ్వని వారి ఫైల్ పెండింగ్లో పెట్టి వారు ఎంతో కొంత ఇచ్చేంతవరకు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం ప్రజల సమస్యల పరిష్కరించేందుకు పనిచేస్తుందా లేక కొందరి వ్యక్తిగత వ్యవస్థలా నడుస్తోందా..?” అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సామాన్య ప్రజలు చిన్న పని కోసం రోజుల తరబడి తిరుగుతుంటే కొందరికి మాత్రం నిమిషాల్లో ఫైళ్లు క్లియర్ అవుతున్నాయనే ఆరోపణలు తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. ఎవరు పైసలు ఇస్తే వాళ్ల పనులే ముందుగా చేపిస్తున్నడని ఆ ప్రైవేట్ వ్యక్తుల పట్ల ప్రజల్లో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

**- దిర్సంపల్లి లో వెంచర్ లేకుండానే**

దోమ మండలం దిర్సంపల్లి గ్రామంలోని కొన్ని సర్వే నెంబర్లకు సంబంధించిన భూమిలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి వెంచర్, లే ఔట్స్, ఫార్మ్ ల్యాండ్, ఏర్పాటు చెయ్యకుండానే.. ఒక్కో గుంటకు ఒక రేటు ఫిక్స్ చేసి ముడుపుల రూపంలో అధికారులను మేనేజ్ చేస్తూ.. ఒక్కో గుంట లెక్కన విక్రయించడం జరిగింది. ఆ పక్కనే ఉన్న మరి కొందరు రైతులు అదే విధంగా విక్రయించి రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసిల్దార్ కార్యాలయానికి వెళితే.. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్, లే ఔట్స్, ఫార్మ్ ల్యాండ్, ఏర్పాటు చెయ్యకుండా రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదని ఓ అధికారి చెప్పడంతో వాళ్ళకు మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తారు. మాకెందుకు చేయరని అ అధికారిని ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానం చెప్పి తప్పించుకున్నాడని అధికారి తీరుపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో డబ్బులు ఇస్తే ఏ పనైనా చేస్తారా.. అనే విమర్శలు బలంగా ఉన్నాయి.

**- కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి..**

జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల జోక్యానికి చెక్ పెట్టకపోతే... ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం పూర్తిగా దెబ్బతింటుంద ని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా దిర్సంపల్లి భూమి అక్రమ రిజిస్ట్రేషన్ పై వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఈ రిజిస్ట్రేషన్ కు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి..



- ఆర్డీఓకు పరిగి సీపీఎం ఏరియా కమిటీ వినతి

**పరిగి, జూలై 09 :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణఎస్ఐఆర్. ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని కోరుతూ సీపీఐ.ఎం వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డీఓ వాసుచంద్ర, కు మెమోరాండం అందజేశారు. పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ సమీక్ష సమావేశంలో ఈ మెమోరాండంను అందజేశారు. ఈ సం దర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంక టయ్య మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గంలోని పరిగి, దోమ, పూడూర్, కుల్కచర్ల, గండీడ్ మండలాల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన లేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు కొనసాగుతున్నందున ప్రజలు తమ వివరాల నమోదు ప్రక్రియలో పూర్తిగా పాల్గొనేందుకు మరింత సమయం అవసరమన్నారు. ఇప్పటికీ అనేక గ్రామాల్లో ఓటర్లకు ఫారాలు అందకపోవడం, ఫారాల నింపడం, అవసరమైన వివరాలు సమర్పించడం వంటి అంశాలపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని కోరారు. 2002లో నిర్వహించిన ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ అనంతరం చాలా కాలం గడిచిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు సరైన అవగాహన కల్పించి, తగిన సమయం ఇవ్వడం అవసరమని అన్నారు. కావున ఎస్ ఐ ఆర్ ఎన్యూమరేషన్ గడువును 2026 ఆగస్టు 30 వరకు పొడిగించాలని, గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, బిఎల్ ఓ, ల ద్వారా ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని మెమోరాండంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ఎండీ హబీబ్ పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు





- నివాళులు అర్పించిన వైఎస్ఆర్సీపీ నేతలు శీలం శ్రీను
- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత
- వైఎస్ఆర్సీపీ నేత శీలం శ్రీను

**షాద్ నగర్ జూలై 09 :** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా షాద్‌నగర్ చౌరస్తా ప్రధాన కూడలిలో ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ యువనేత శీలం శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శీలం శ్రీను మాట్లాడుతూ... అధికారం అంటే ప్రజలకు సేవ చేయడమే అనే భావనను తన పాలన ద్వారా ఆచరణలో చూపించిన నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను తన సమస్యలుగా భావించి వారికి అండగా నిలిచిన అపర భగీరథుడిగా వైఎస్సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. జూలై 8న నిర్వహించిన 77వ జయంతి సందర్భంగా మహానేత సేవలను స్మరించుకోవడం ప్రతి తెలుగువాడికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు.
పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, ఆరోగ్య సేవలు, విద్యావకాశాలు, సాగునీటి ప్రాజెక్టులు వంటి రంగాల్లో మహానేత డాక్టర్ వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని నేతలు పేర్కొన్నారు. ప్రజల కోసం ఆలోచించిన నాయకుడిగా, ప్రజల హృదయాల్లో నిలిచిన మహానేతగా వైఎస్సార్ ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు పత్తి సంతోష్, ఈదులపల్లి నర్సింహా, బైరంపల్లి డిప్యూటీ సర్పంచ్ కుంటోళ్ల నరేష్, బిక్షపతి, ప్రవీణ్, నరహరి యాదవ్, రమణ రెడ్డి, చెన్నయ్య గౌడ్, ప్రకాష్, కొంకళ్ళ నర్సింహా అభిమానులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా మరుగుదొడ్లు

- నిర్మించారు కానీ వినియోగంలోకి తేలేదు..
- ప్రజా ప్రతినిధులు స్పందించి వినియోగంలోకి తేవాలి
- జిల్లా సాధన సమితి ప్రధానకార్యదర్శి దర్గా వెంకటేష్




**కొందరు జులై 09 :** నిర్మించారు వదిలేశారు నిరుపయోగంగా మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాలని రంగారెడ్డి జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దర్గా వెంకటేష్ డిమాండ్ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం మరుగుదొడ్లు నిర్మించడం జరిగింది. ప్రజా ప్రయోజనార్థం కాని ఇప్పటికీ వాటిని ప్రజల దూర ప్రాం తాలకు ప్రయాణంచేసేవారికి అక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు నిర్లక్ష్యం వహించడం సరి కాదన్నారు. ప్రయాణికులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారు సైతం మహిళలు గర్భిణీ స్త్రీలు వృద్ధులను చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది కానీ అక్కడ చక్కగా కనిపిస్తున్న మరుగుదొడ్లకు తాళం వేసి ఉంచటం వల్ల మూత్రశలలోనే కాల కృత్యాలకు తీర్చుకోవటం వల అక్కడి పరిస్థితులు చాలా దుర్గంధ భరితంగా తయారయ్యాయని వెంకటేష్ తెలిపారు. అయితే ప్రజా ప్రయోజనార్థం నిర్మించిన మరుగు దొడ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రయానికుల తీవ్ర ఇబ్బందులను తీర్చాలని అక్కడ సంబంధిత అధికారుకు వెంటనే చర్యలు చేపట్టి నిర్వాహకులను నియమించాలని అక్కడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని షాద్నగర్ జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దర్గా వెంకటేష్ కోరారు మీడియా ద్వారా కోరారు..

# అనుమతుల్లేని పర్మిట్ రూములపై పోలీసుల దాడులు

- బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై కేసు నమోదు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు
- కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్





**కుల్కచర్ల జూలై 09 :** నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకుంటే తపరమైన చర్యలతో తప్పవని కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు, కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు ప్రశాంత వాతా వరణం కల్పించడం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అక్రమంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు ఆకస్మిక దాడులు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా హోటళ్లు, సమీపంలోని దుకాణాలు, అనుమతి లేని పర్మిట్ రూమ్‌లు, ఇతర అనుమానాస్పద ప్రదేశాలను విస్తృతంగా తనిఖీ చేయగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న పలువురిపై ఈ-పెటీ కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.
అదేవిధంగా, మద్యం విక్రయానికి మాత్రమే అనుమతి ఉండి, వినియోగానికి అనుమతి లేని ప్రదేశాల్లో కస్టమర్లను కూర్చోబెట్టి మద్యం తాగేందుకు అవకాశం కల్పించడం, మద్యంతో పాటు స్నాక్స్, స్టార్టర్స్ ఇతర ఆహార పదార్థాలను సరఫరా చేయడం, అక్రమంగా పర్మిట్ రూమ్‌లను నిర్వహించడం పూర్తిగా చట్టవిరుద్ధమని సంబంధిత నిర్వాహకులకు కఠినంగా హెచ్చరికలు జారీ చేయబడినవి. భవిష్యత్తులో ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగించినట్లయితే సంబంధిత నిర్వా హకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, సంబంధిత శాఖలకు నివేదించి వారి లైసెన్సులపై కూడా తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజా ప్రశాంతత కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు కూడా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చట్టాన్ని గౌరవించాలని, అక్రమంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ రమేష్ కుమార్ కోరారు.

# అజీర్తిని తగ్గించే మ్యాజికల్ పాడి, మన ఇంట్లో ఉండే మెంతులు ం జీలకర్ర ం సోంపుతో సులభంగా తయారు చేసుకోవచ్చు!



నేటి ఆధునిక కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, ఉరుకుల పరుగుల జీవితం, నిద్రలేమి, ఒత్తిడి వంటి అనేక కారణాల వల్ల కలిగే అజీర్తి కారణంగా చాలా మంది ఇబ్బంది పడుతూ ఉంటారు. ఈ సమస్య వల్ల కడుపు అసౌకర్యంగా, మంటగా, ఉబ్బరంగా ఉంటుంది. దీనికోసం మెడికల్ షాపులలో దొరికే రకరకాల మందులు వాడుతూ ఉంటారు. అయితే మన ఇంట్లో దొరికే ప్రకృతి ప్రసాదించిన సహజ పదార్థాలు ఈ అజీర్తి సమస్యను తగ్గిస్తుందని మన అమ్మమ్మలు, నానమ్మలు చెప్పేవాళ్లు. ముఖ్యంగా అజీర్తిని తగ్గించడానికి మెంతులు, జీలకర్ర, సోంపు, పెరుగుతో చేసిన ఇంటి చిట్కా అద్భుతంగా పనిచేస్తుంది. మీ ఫ్యామిలీతో కలిసి సంతోషంగా భోజనం చేసిన తర్వాత.. మీ కడుపు అసౌకర్యంగా, మంటగా, ఉబ్బరంగా అనిపించవచ్చు. మనందరిలో చాలామంది దీనిని ఎక్స్‌పీరియన్స్ అయ్యే ఉంటారు. అజీర్తి కారణంగా హెవీగా తిన్నప్పుడు కొంత ఇబ్బంది ఎదుర్కోవలసి ఉంటుంది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ భారీ జంప్

ఒకపక్క టీమిండియా వరుస పరాజయాలు అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. మైదానంలో జట్టు సమష్టి వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తోంది. ఇలాంటి గడ్డు కాలంలోనూ భారత ఫ్యాన్స్‌కు ఒక చల్లని కబురు అందింది. తాజాగా విడుదలైన ఐసీసీ మెన్స్ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు, ముఖ్యంగా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ సాధించిన ప్రగతి ఇప్పుడు క్రీడా వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. జాగ్రన్ (జీుస్త్రతీుఅ) నివేదిక ప్రకారం.. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో శ్రేయస్ అయ్యర్ ఏకంగా 425 స్థానాలు ఎగబాకి అందరినీ ఆశ్చర్యపరిచాడు. జట్టు వరుసగా ఓడిపోతున్న సమయంలో ఒక ఆటగాడు ర్యాంకింగ్స్‌లో ఇంత భారీ జంప్ చేయడం సాధారణ విషయం కాదు. మరోవైపు యువ సంచలనాలు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ కూడా బ్యాటింగ్ జాబితాలో అగ్రస్థానాల్లో కొనసాగుతూ సత్తా చాటుతున్నారు. అయితే, అందరి దృష్టి మాత్రం అయ్యర్ అనూహ్య జంప్ పైనే పడింది. జట్టు ఓడిపోయినా అయ్యర్ ర్యాంక్ ఎలా పెరిగింది? అన్నది ఇప్పుడు సగటు అభిమాని మదిలో మెదులుతున్న ప్రశ్న. ఐసీసీ ర్యాంకింగ్స్ విధానం చాలా సంక్లిష్టమైన అల్గారిథమ్‌పై పనిచేస్తుంది. కేవలం మ్యాచ్ రిజల్ట్‌ను మాత్రమే ఇది పరిగణనలోకి




తీసుకోదు. పిచ్ స్వభావం, ప్రత్యర్థి బౌలర్ల నాణ్యత, జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆడిన ఇన్నింగ్స్.. వీటన్నింటికీ అదనపు పాయింట్లు ఇస్తుంది. టాప్ ఆర్డర్ త్వరగా పెవిలియన్ చేరుతున్న సమయంలో శ్రేయస్ అయ్యర్ క్రీజులో నిలబడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించే బాధ్యత తీసుకున్నాడు. ఇండియా హెరాల్డ్ విశ్లేషణ ప్రకారం.. ఇక్కడే అయ్యర్‌కు ఐసీసీ రేటింగ్స్ కలిసొచ్చాయి. భారీ సెంచరీలు చేయకపోయినా, ప్రెజర్ సిట్యువేషన్‌లో అతను సాధించిన పరుగులు, నిలకడైన స్ట్రైక్ రేట్ అతని రేటింగ్ పాయింట్లను అమాంతం పెంచేశాయి. ఓడిపోయిన మ్యాచ్‌లలో కూడా జట్టు స్కోరులో అతని వ్యక్తిగత కంట్రిబ్యూషన్ గణనీయంగా ఉండటమే ఈ 425 స్థానాల జంప్‌కు ప్రధాన కారణం. క్లిష్ట పరిస్థితుల్లో ఆడిన ఇన్నింగ్స్‌కు పాయింట్ల లెక్కింపులో అత్యధిక ప్రాధాన్యత దక్కుతుంది. బలమైన బౌలింగ్ లైనప్ ఉన్న జట్లపై ఆడే ఇన్నింగ్స్‌లకు కూడా ర్యాంకింగ్స్‌లో అదనపు రేటింగ్ దక్కుతుంది. ఇటీవల టీమిండియా ఆడిన మ్యాచ్‌లలో పిచ్‌లు బౌలర్లకు అనుకూలించాయి. ఇలాంటి కఠినమైన పిచ్‌లపై పేసర్లను, స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ అయ్యర్ చేసిన పరుగులు అతని ర్యాంక్ మెరుగుదలకు దోహదపడ్డాయి. డాట్ బాల్స్ శాతం తగ్గించుకుంటూ, సింగిల్స్, డబుల్స్‌తో స్ట్రైక్ రొటేట్ చేయడం ద్వారా అతను ఐసీసీ అల్గారిథమ్‌లో అత్యధిక మార్కులు కొట్టేశాడు. ఈ ర్యాంకింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్‌తో పాటు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మల ప్రదర్శన కూడా హైలైట్ అయింది. టాప్ బ్యాటింగ్ స్పాట్స్‌లో వీరు స్థిరంగా కొనసాగుతున్నారు.





# నాటింగ్ హామ్‌లో టీమిండియా ఘోర ఓటమి

ఇంగ్లాండ్‌తో మూడో టీ20 మ్యాచులో భారత్ చిత్తుగా ఓడిపోయింది. మంగళవారం నాటింగ్ హామ్ వేదికగా జరిగిన ఈ మ్యాచులో ఏకంగా 125 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. 11.4 ఓవర్లలో 76 పరుగులకు కుప్పకూలింది. దీంతో టీ20ఐ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. ఈ విజయంతో ఐదు మ్యాచుల సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ తిరుగులేని 2–0 ఆధిక్యంలోకి వెళ్లింది. గత రెండు మ్యాచులలో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కానీ ఈ మ్యాచులో మాత్రం బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత నిదానంగా ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ ఆ తర్వాత ధాటిగా బ్యాటింగ్ చేసింది. తొలి ఓవర్ మెయిడెన్ చేసిన ఫిలిప్ సాల్ట్ చివర్లో బ్యాట్ ఝుళిపించాడు. 44 బంతుల్లో 70 పరుగులు చేశాడు. జోస్ బట్లర్ (36), సామ్ కర్రన్ (41) రాణించడంతో ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 2, ప్రిన్స్ యాదవ్ 2, అక్షర్ పటేల్ 1 వికెట్ తీశారు. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్‌ను జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ కోలుకోలేని దెబ్బ తీశాడు. అభిషేక్ శర్మ (10)ని జోష్ టంగ్ ఔట్ చేయగా.. జోఫ్రా ఆర్చర్ వైభవ్ సూర్యవంశీ (5 బంతుల్లో 13 రన్స్)ని బుట్టలో వేసుకున్నాడు. ఇషాన్ కిషన్ (13), శ్రేయస్ అయ్యర్ (5), అక్షర్ పటేల్ (10) కూడా స్వల్ప వ్యవధిలోనే ఔట్ అయ్యారు. దీంతో పవర్ ప్లే ముగిసేలోపే భారత్ ఐదు వికెట్లు కోల్పోయింది. తిలక్ వర్మ (3), హర్షిత్ రాణా (9), శివమ్ దూబె (2) కూడా విఫలం కావడంతో టీమిండియా 11.4 ఓవర్లలో 76 పరుగులకు కుప్పకూలింది. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 4 వికెట్లు, జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు తీశారు. ఆదిల్ రషీద్ 2, విల్ జాక్స్ ఒక వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఇంగ్లాండ్ ఐదు టీ20ల సిరీస్‌లో 2–0తో తిరుగులేని ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో టీ20 మ్యాచ్.. గురువారం జరగనుంది. నాటింగ్ హమ్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ చిత్తుగా ఓడిపోవడం అభిమానులను షాక్‌కు గురి చేసింది. ఈ మ్యాచ్ అప్డేట్స్ గురించి తెలుసుకోవడానికి ఆసక్తి కనబర్చారు. దీంతో కీవర్డ్ 2 మిలియన్లకుపైగా సెర్చ్ వాల్యూమ్‌తో గూగుల్ ట్రెండ్స్‌లో టాప్‌లో నిలిచింది.

# సంజు శాంసన్ ఫామ్ కోల్పోయాడు

- అందుకే వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకున్నాం
- టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడి

202 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌట్ కావడంతో, టీ20 ప్రపంచకప్ 2026 హీరో సంజు శాంసన్‌ను ప్లేయింగ్ ఎలెవన్ నుండి పక్కన పెట్టడంపై పెద్ద ఎత్తున ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఈ వివాదాస్పద నిర్ణయంపై గంభీర్ స్పందిస్తూ.. జట్టు ఎంపిక విషయంలో తనకు, సంజు శాంసన్‌కు మధ్య పూర్తి స్పష్టత ఉందని, అయితే ఆ అంతర్గత సంభాషణను తాను బహిర్గతం చేయలేనని స్పష్టం చేశారు. టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా



రాణించిన శాంసన్, ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో వరుసగా 5, 0, 1 పరుగులకే పరిమితమై ఫామ్ కోల్పోయాడు. అతని స్థానంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకున్నారు. మొదటి విషయం ఏంటంటే, సంజు శాంసన్‌కు జట్టులో తన పాత్ర గురించి ఎలాంటి స్పష్టత కావాలో, అది నా వైపు నుండి అతనికి ఇప్పటికే అందించబడింది. ఇది పూర్తిగా ఒక ఆటగాడికి, హెడ్ కోచ్‌కు మధ్య జరిగిన వ్యక్తిగత సంభాషణ, ఇది బయటకి రాదు. సంజు విషయంలో మాకు పూర్తి క్లారిటీ ఉంది. భారత్ తరఫున అతను చేసిన ప్రదర్శన అసాధారణమైనది. కానీ, కొన్నిసార్లు ఒక నిర్దిష్ట ఆటగాడి ప్రస్తుత ఫామ్‌ను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అతడు ఈ సిరీస్‌లో మళ్లీ ఆడే అవకాశాలు కూడా ఉన్నాయి' అని గంభీర్ స్పష్టం చేశాడు. టీమ్ కాంబినేషన్, ప్రస్తుత ఫామ్, ఫలితాల ఆధారంగానే ఈ మార్పులు చేయాల్సి వచ్చిందని గంభీర్ సమర్థించుకున్నారు. శాంసన్‌కు టీ20 ప్లాన్స్‌లో తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెబుతూనే, ప్రస్తుతానికి ఫామ్‌కు ప్రాధాన్యత ఇవ్వక తప్పలేదని కోచ్ తేల్చి చెప్పారు.

# ఇంగ్లాండ్‌లో బౌలింగ్ చేయడం చాలా ఈజీగా అనిపిస్తుంది

## స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ పిచ్‌లతో పోలిస్తే ఇంగ్లండ్ పరిస్థితులు బౌలర్లకు అనుకూలంగా ఉంటాయని స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ అన్నాడు. భారత్‌లో చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ల వల్ల బౌలర్లకు తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉండదని, ఇంగ్లండ్‌లో మాత్రం పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉంటాయని చెప్పాడు. ఇదే భారత బ్యాటర్లకు ఇబ్బందిగా మారిందని పరోక్షంగా వెల్లడించాడు. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం రాత్రి ట్రెంట్ బ్రిడ్జ్‌లో వేదికగా జరిగిన మూడో టీ20లో టీమిండియా 125 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఆర్చర్.. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఇంగ్లండ్‌లో బౌలింగ్ చేయడం చాలా ఈజీగా అనిపిస్తుంది. ఐపీఎల్‌లో మాత్రం కొన్ని సందర్భాల్లో 200 పరుగులు కూడా సురక్షితం కాదు. కానీ ఇక్కడ బౌలర్లకు పరిస్థితులు కొంత అనుకూలంగా ఉంటాయి. పిచ్ నుంచి బౌన్స్ లభిస్తుంది. రాంగ్ డెలివరీని కూడా కొన్నిసార్లు ఫీల్డర్లు రక్షించగలరు. భారత్‌లో బౌలర్లు ఎలాంటి చిన్న తప్పు చేసినా వెంటనే భారీ షాట్ల రూపంలో శిక్ష పడుతుంది. అందుకే అక్కడ బౌలింగ్ చేయడం కఠినంగా ఉంటుంది. ఇంగ్లండ్ పిచ్‌లపై 200 పరుగులు సాధిస్తే విజయం దాదాపు ఖాయం. మా బౌలర్లు కొత్త బంతితో దాడి చేయగలిగారు. సరైన లైన్, లెంగ్త్ దొరికితే ఈ వికెట్‌పై వికెట్లు రావడం సహజం. ఐపీఎల్‌లో ఒక్కోసారి 200 పరుగులు చేసినా విజయం దక్కదు. కానీ ఇంగ్లండ్ పరిస్థితుల్లో బౌలర్లకు కాస్త వెసులుబాటు ఎక్కువగా ఉంటుంది.'అని జోఫ్రా ఆర్చర్ చెప్పుకొచ్చాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టులో తన సహచరుడైన 15 ఏళ్ల భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీతో సాగుతున్న పోరుపై కూడా ఆర్చర్ స్పందించాడు. మాంచెస్టర్ మ్యాచ్‌లో తొలి బంతికే తనను సిక్సర్ కొట్టిన వైభవ్‌ను, ఈ మ్యాచ్‌లో ఆర్చర్ 13 పరుగుల వద్ద పెవిలియన్‌కు పంపాడు. ప్రస్తుతం ఇద్దరి మధ్య పోటీ సమంగా ఉందని ఆర్చర్ సరదాగా అన్నాడు. 'ఇప్పుడు ఇద్దరం సమానమే. ఇంకా రెండు మ్యాచ్‌లు




మిగిలి ఉన్నాయి. చివరికి ఎవరు మెరుగ్గా రాణిస్తారో చూద్దాం.' అని నవ్వుతూ చెప్పాడు. ఈ మ్యాచ్‌లో జోఫ్రా ఆర్చర్ 29 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా.. మరో పేసర్ జోష్ టంగ్ 38 పరుగులకు 4 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఈ ఇద్దరూ గంటకు 144 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి, పిచ్ నుంచి లభించిన అదనపు బౌన్స్‌ను చక్కగా ఉపయోగించుకున్నారు. ఐర్లాండ్‌తో సిరీస్ ఓడిపోయిన శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు.. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–0తో వెనుకంజలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షం వల్ల రద్దు కాగా.. నాలుగో టీ20 మ్యాచ్ గురువారం బ్రిస్టల్‌లో జరగనుంది. ఈ సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే భారత్ ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి.

# క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా!

2026 ఫీఫా ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లేందుకు అర్జెంటీనా, ఈజిప్ట్‌ను 3–2 తేడాతో ఓడించింది. చివరి నిమిషాల్లో అర్జెంటీనా మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకుంది. లియోనెల్ మెస్సీ, ఇతర అర్జెంటీనా ఆటగాళ్లు చివరి నిమిషాల్లో అద్భుతంగా ఆడారు. మహమ్మద్ సలాహ్ సారథ్యంలోని ఈజిప్ట్ జట్టు అర్జెంటీనా అభిమానులను ఉత్కంఠకు గురిచేసినా, సూపర్ 8లోకి వెళ్లడంలో విఫలమైంది. అర్జెంటీనా చివరిసారిగా 2018లో క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయింది. 2026 ప్రపంచ కప్‌లో కూడా ఈజిప్ట్ మెస్సీ జట్టును ఓడించింది, కానీ లియోనెల్ మెస్సీ, క్రిస్టియన్ రొమెరో, ఎంజో ఫెర్నాండెజ్ అర్జెంటీనాను గెలిపించడంలో సహాయపడ్డారు. మ్యాచ్‌లో ఈజిప్ట్ తరఫున తొలి గోల్ 15వ నిమిషంలో యాసర్ ఇబ్రహీం చేసి జట్టుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. 67వ నిమిషంలో ముస్తఫా జికో రెండో గోల్ చేసి ఈజిప్ట్‌కు 2–0 ఆధిక్యాన్ని అందించాడు. 78వ నిమిషం వరకు ఈజిప్ట్ 2–0 ఆధిక్యంలోనే కొనసాగింది. ప్రపంచ కప్ వంటి అధిక ఒత్తిడి గల మ్యాచ్‌లలో గోల్స్ చేయడం కష్టం, కానీ 79వ నిమిషంలో క్రిస్టియన్ రొమెరో గోల్ చేయడంతో అర్జెంటీనా ఆశలు మళ్లీ చిగురించాయి. కేవలం నాలుగు నిమిషాల తర్వాత, లియోనెల్ మెస్సీ తన 21వ ప్రపంచ కప్ గోల్‌ను సాధించాడు. అయితే, అదే మ్యాచ్‌లో 19వ నిమిషంలో మెస్సీ పెనాల్టీని కోల్పోయాడు. ఆ క్షణంలో అక్కడి వాతావరణం ఎంతలా ఉందంటే, మొత్తం మైదానం నిశ్శబ్దంగా ఉండిపోయింది. మ్యాచ్ సమయం ముగిసే వరకు మ్యాచ్ 2–2తో సమంగానే కొనసాగింది. అదనపు సమయం తర్వాత, 93వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ అర్జెంటీనా తరఫున మ్యాచ్‌లో మూడో, నిర్ణయాత్మక గోల్‌ను సాధించాడు. అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఫీఫా ప్రపంచ




కప్ 2026లోకి అడుగుపెడుతోంది. మెస్సీ జట్టు ఇప్పుడు వరుసగా రెండో టైటిల్, మొత్తంగా నాలుగో టైటిల్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం మూడు విజయాల దూరంలో ఉంది. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ఏడో జట్టుగా అర్జెంటీనా నిలిచింది. అంతకుముందు, ఫ్రాన్స్, మొరాకో, స్పెయిన్, బెల్జియం, ఇంగ్లాండ్, నార్వే ఇప్పటికే చివరి ఎనిమిది జట్లలో తమ స్థానాలను సురక్షితం చేసుకున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో అర్జెంటీనా ఇప్పుడు స్విట్జర్లాండ్, కొలంబియా మధ్య జరిగే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ విజేతతో తలపడుతుంది. ఈ మ్యాచ్ సందర్భంగా, లియోనెల్ మెస్సీ ఒక తప్పు చేశాడు. నిజానికి, అంత కీలకమైన మ్యాచ్‌లో మెస్సీ పెనాల్టీని గోల్‌గా మార్చడంలో విఫలమయ్యాడు. 15వ నిమిషంలో ఈజిప్ట్ 1–0 ఆధిక్యం సాధించగా, 19వ నిమిషంలో అర్జెంటీనాకు పెనాల్టీ లభించింది. అయితే, మెస్సీ ఆ పెనాల్టీని మిస్ చేశాడు. ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో కూడా మెస్సీ ఒక పెనాల్టీని మిస్ అయ్యాడు. ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా అదే జరిగినప్పుడు, స్టేడియం మొత్తం నిశ్శబ్దమైపోయింది. ప్రతి ఒక్కరూ, "ఓరి దేవుడా, మెస్సీ! నువ్వేం చేశావు?" అని ఆశ్చర్యపోయారు. ఆరు ప్రపంచ కప్ టోర్నమెంట్లలో మెస్సీ పెనాల్టీని గోల్‌గా మార్చడంలో విఫలమవడం ఇది నాలుగోసారి. లియోనెల్ మెస్సీ 2006లో తన ప్రపంచ కప్ అరంగేట్రం చేసాడు. అతను 2026లో తన ఆరో ప్రపంచ కప్‌లో ఆడుతున్నాడు. గత 20 ఏళ్లలో మెస్సీ పెనాల్టీని స్కోర్ చేయడంలో విఫలమవడం ఇది నాలుగవసారి. అతను ఆరు ప్రపంచ కప్‌లలో నాలుగు పెనాల్టీలను మిస్ అయ్యాడు. ప్రపంచ కప్‌లలో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు మెస్సీ పేరిట ఉన్నప్పటికీ, నాలుగు పెనాల్టీలను మిస్ అయిన రికార్డు అతని కెరీర్‌పై చెరగని మచ్చగా కూడా గుర్తుండిపోతుంది.

# రాకాను వదులుకున్న ప్రీతి ముకుందన్

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని ప్రీతి ముకుందన్ వదులుకున్నట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై అట్లీ స్పందించారు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. నేను ప్రీతి నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. అప్పటికే ఆమె బిజీగా ఉండటంతో మాకు డేట్స్ కేటాయించలేక పోయింది. దీంతో ఈ ప్రాజెక్టును ఆమె వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రీతి రిజెక్ట్ చేసిన ఈ కీలక పాత్రను మలయాళ నటి ఫెమినా జార్జ్‌కు ఆఫర్ చేసినట్లు అట్లీ స్పష్టం చేశారు. ఆ పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. 'కన్నప్ప'తో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రీతి ముకుందన్ ఇటీవల 'బ్లాస్ట్'తో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు తమిళ రొమాంటిక్ కామెడీ 'హృదయం మురళి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. జులై 10న విడుదల కానుంది.






# 'టాక్సిక్' నుంచి తొలి పాట విడుదల

యశ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్' నుంచి 'తబాహి' పేరుతో తొలి వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. పాటలో యశ్, కియారాల జోడీ, వారి మధ్య చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. విజువల్స్ పరంగా పాట బాగుందని చెప్పచ్చు. ఈ పాట తెలుగు వెర్షన్‌కు ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు.

గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి భారీ తారాగణం నటిస్తోంది. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై యశ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## ఎమోషనల్ రొమాంటిక్ డ్రామా..

# హృదయ మురళి




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' . ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా కనిపసించడం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## నవీన్ పోలిశెట్టి సినిమాకు

# తమిళ దర్శకుడు

ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో నవీన్ పొలిశెట్టి. ఇది ఆయన కెరీర్‌లో రూ.100కోట్ల వసూళ్లు సాధించిన తొలి సినిమాగా పేరు తెచ్చుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఆయనతో ఓ సినిమా చేయబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం ఓ తమిళ దర్శకుడితో చేతులు కలుపుతున్నట్లు తెలిసింది. 'సైరన్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆంటోని భాగ్యరాజ్‌తో తను కలిసి పని చేయనున్నట్లు సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రంపై స్పష్టత వచ్చే అవకాశముంది.





# సుకుమార్ స్కూల్ నుంచి మరో దర్శకుడు

## బాబీ దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ కేవలం విజయవంతమైన సినిమాలు తెరకెక్కించడమే కాకుండా, ఇండస్ట్రీకి పలువురు ప్రతిభావంతులైన దర్శకులను అందించిన గురువుగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన అనేక మంది దర్శకులు ప్రస్తుతం టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొత్త దర్శకుడు చేరనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ సోదరుడి కుమారుడు బాబీ త్వరలో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గత కొంతకాలంగా సుకుమార్ వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాబీ.. ఆయన సినిమాలతో పాటు పలు ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తి స్థాయి దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో రూపొందనున్న తొలి చిత్రంలో యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కథను సిద్ధుకు వినిపించగా, ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సుకుమార్ క్యాంప్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడం, కథ కూడా నచ్చడంతో సిద్ధు ఈ సినిమాకు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ వద్ద పనిచేసిన శిష్యుల తొలి చిత్రాలు ఎక్కువగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లోనే రూపొందాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బాబీ తొలి సినిమాను కూడా సుకుమార్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇది విధి నిర్ణయం

## శ్రీలీల గురించి భాగ్యశ్రీ కామెంట్స్ వైరల్!



అఖిల్ అక్కినేని హీరోగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన లెనిన్ రిలీజ్ కు రెడీ అవుతున్న వేళ, సినిమా చుట్టూ ఆసక్తికరమైన విషయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌తో మంచి బజ్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన భాగ్యశ్రీ బోర్సే తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట శ్రీలీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, అవకాశాన్ని భాగ్యశ్రీ బోర్సే అందుకుంది. ఈ నేపథ్యంలో శ్రీలీల చేయాల్సిన సినిమా మీకు రావడం అదృష్టంగా భావిస్తున్నారా? అనే ప్రశ్నకు భాగ్యశ్రీ ఎంతో పరిణితితో స్పందించిందిప్రతి కథ అందులో ఎవరు నటించాలో ముందే నిర్ణయించుకుంటుందని, ఒక పాత్ర ఎవరికి దక్కాలో అది విధే నిర్ణయిస్తుందని, లెనిన్ లో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఈ అవకాశం రావడం వెనుక కూడా ఆ డెస్టినీనే ఉందంటూ ఆమె చెప్పిన మాటలు ఆకట్టుకుంటున్నాయి. మరో హీరోయిన్ చేయాల్సిన పాత్ర తనకు రావడంపై ఎలాంటి పోలికలు లేకుండా, కథపై నమ్మకంతో ఆమె ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటోంది. ఇక భాగ్యశ్రీ కెరీర్ పరంగా చూస్తే లెనిన్ చాలా కీలకమైన సినిమా. గత కొంతకాలంగా ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ లు అందుకోలేదు. దీంతో ఈ సినిమా ఆమెకు తప్పనిసరిగా హిట్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా టాలీవుడ్ లో నిలదొక్కుకోవాలంటే ఈ సినిమా రిజల్ట్ ఆమె కెరీర్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే లెనిన్ రిలీజ్‌కు ముందే భాగ్యశ్రీకు మంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడం విశేషం. టీజర్, ట్రైలర్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్, అఖిల్‌తో కెమిస్ట్రీ ఆడియన్స్ ను ఆకట్టుకున్నాయి. సోషల్ మీడియాలో కూడా ఆమె లుక్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా రిలీజ్ తర్వాత ఆమె క్యారెక్టర్‌కు మంచి గుర్తింపు వస్తే, టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే టీమ్ చేస్తున్న ప్రమోషన్స్ లెనిన్‌పై అంచనాలను మరింత పెంచాయి. అఖిల్ కెరీర్‌లో ఈ సినిమా ఎంత కీలకమో, భాగ్యశ్రీ కెరీర్‌కు కూడా లెనిన్ అంతే ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా మారింది. డెస్టినీ తనను ఈ సినిమాకు తీసుకొచ్చిందని చెప్పిన భాగ్యశ్రీకి, అదే డెస్టినీ సక్సెస్ ను కూడా అందిస్తుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జులై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న లెనిన్ రిజల్ట్ అఖిల్‌తో పాటు భాగ్యశ్రీ సినీ కెరీర్ కు కూడా కొత్త మలుపు తీసుకురానుందేమో చూడాలి.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com